ప్రజాశక్తి
శుక్రవారం 15 ఆగస్టు 2025 5 విజయనగరం



ప్రతిఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రతి పౌరునిలో దేశభక్తిని పెంపొందించేందుకు కృషి చేయాలని హోంమంత్రి అనిత కోరారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్ వద్ద ఆమె గురువారం సెల్ఫీ దిగారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని ఆమె పిలుపునిచ్చారు.



హర్‌ఘర్‌తిరంగా సెల్ఫీపాయింట్ వద్ద ఫొటో తీసుకుంటున్న మంత్రి అనిత

డయేరియా మరణాలకు అధికారులదే బాధ్యత

- బల్క్‌మిల్క్ సెంటర్లు, మద్యం రవాణా అద్దెల చెల్లింపుపై విచారణ
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత
- తోటపల్లి ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక : మంత్రి కొండపల్లి
- ఎరువుల కొరత లేదు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో డయేరియా కేసులు నమోదైతే సహించేది లేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. డయేరియాతో ఒక్క మరణం సంభవించినా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బల్క్‌మిల్క్ సెంటర్ల నిర్మాణాలు, నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్టు తన దృష్టికి వచ్చిందని, దీనిపై దర్యాప్తు నిర్వహించి 15రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మద్యం రవాణా అద్దెల చెల్లింపు విషయమై రెండేళ్లగా కాలయాపన చేసినట్టు తెలిసిందని, దీనిపై 10రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. తోటపల్లి ప్రాజెక్ట్‌పై సమగ్ర నివేదిక జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, మరో 10వేల మెంట్రిక్ టన్నుల యూరియా త్వరలోనే వస్తుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగల పూడి అనిత అధ్యక్షతన కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశం లో వ్యవసాయం, జలవనరులు, వైద్య ఆరోగ్యం, విద్య, హౌసింగ్, పరిశ్రమలు, ఎక్సైజ్ , తదితర శాఖల పై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల వారీగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందిస్తూ వైద్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ శాఖల ద్వారా పారిశుద్ధ్యం పై ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని, పైప్ లైన్ల ను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయించి , డ్రైనేజి వద్ద నున్న వాటిని తొలగించి రక్షిత నీటి సరఫరా జరుగుతోందని వివరించారు. బాలికల వసతి గృహాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972ను డిస్‌ప్లే చేయాలని సూచించారు. చిన్న చిన్న మరమ్మత్తులు ఉన్న పాఠశాలలను గుర్తించి జాబితాను ఇవ్వాలని మంత్రి అనిత తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మండల ప్రత్యేకాధికారులను వసతి గహాల తనిఖీలకు పంపించి సందర్శించి నివేదికనివ్వాలని ఆదేశిస్తానని తెలిపారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలపై నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు.


మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తోటపల్లి ద్వారా 1,30,000 ఎకరాలకు నీరందించే లక్ష్యంతో ఉన్నామని, లిఫ్ట్ ద్వారా ఎంత నీరు వెళ్తోంది, మిగిలిన కుడి, ఎడమ కాల్వల ద్వారా ఎంత నీరు వెళుతోంది, పూడికల పరిస్థితి, ఎంత డబ్బు అవసరం అవుతుందనే వివరాలతో పూర్తి నివేదిక ఇవ్వాలని తెలిపారు. రెవిన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. డిసిసిబి అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ తోటపల్లి అంశంపై సమగ్రంగా చర్చ జరగాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మన్యం కలెక్టర్‌తో చర్చించి , వివరంగా నివేదికను ఇస్తామని, అనంతరం ప్రజా ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. చెరకు రైతుల్లో నమ్మకాన్ని పెంచి విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ తోటపల్లి నీటిని ఆలస్యంగా విడుదల చేసినందున శివారు భూములకు సకాలం లో నీరందలేదని, నీటి విడుదల ఎందుకు ఆలస్యం చేసారని ప్రశ్నించారు. రాజాం మండలం రైతులకు నీరందడానికి ఇంకా 15 రోజులు పడుతుందని, గతంలో ఇటువంటి పరిస్థితి లేదని ఆయన ప్రశ్నించారు. ఇంఛార్జి మంత్రి అనిత స్పందిస్తూ మూడు జిల్లాలకు సంబంధించిన విషయం కావునా కలెక్టర్లతో, ప్రజా ప్రతినిధులతో, నీటి సంఘాల ప్రతినిధులతో మాట్లాడుకొని నీటి విడుదలకు 3 నెలల ముందే పక్కా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎరువుల కొరత పెద్దగా లేదని, ప్రస్తుతం 5వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 10 వేల మెట్రిక్ టన్నులు కావాలని లేఖ రాశామని కలెక్టర్ తెలిపారు. ఈలోగా ఎక్కువగా స్టాక్ ఉన్న చోట నుండి అవసరం ఉన్న చోటుకు సర్దుబాటు చేస్తున్నామని, నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల గురించి వివరించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, ఎంఎల్‌సిలు డాక్టర్ సురేష్ బాబు, ఇందుకూరి రఘు రాజు, గాదె శ్రీనివాసులు నాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ యశస్వి , డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, సిపిఒ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత బస్సులు ప్రారంభం

మంత్రి అనిత

రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచితంగా ప్రయాణించడానికి స్త్రీ శక్తి బస్సులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తామని హోంశాఖ మంత్రి అనిత తెలిపారు. గురువారం నిర్వహించిన డిఆర్‌సి సమావేశం అనంతరం ఆర్టీసిలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకంపై ఆమె మాట్లాడారు. ఈ పథకాన్ని శుక్రవారం విజయవాడ నుంచి సిఎం చంద్రబాబు ప్రారంభిస్తారని, దీనికి అనుసంధానంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభ సభలు జరుగుతాయని స్పష్టం చేశారు. మొత్తం 5 రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్టు వివరి ంచారు. బస్సుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులకు మంత్రి సూచించారు. గంట్యాడ, రాజాం డ్వాక్రా సంఘాల వారికీ రాష్ట్ర స్థాయి లో అవార్డు రావడం పట్ల మంత్రి అభినందించారు. వంగర కెజిబివిలకు ఉత్తమ అవార్డు రావడం అభినందనీయ మన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు బంగారు పతకాలను సాధించిన రెడ్డి భవానీని అభినందిస్తూ కొండకరకాంలో 97.2 చదరపు గజాల ఇళ్ళ స్థలం పట్టాను ఆమె తల్లికి మంత్రి అనిత అందజేశారు.



జిల్లా అంతటా వర్షాలు

- అత్యధికంగా డెంకాడలో 130 మి.మీ. వర్షం
- ఊపందుకున్న ఉబాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

బంగాళా ఖాతంలో అల్పపీడన ప్రభావంతో విజయనగరం జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా మొత్తంగా సరాసరి 40 మిలీమీటర్ల వర్షం కురిసింది. ఏకధాటి వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరోవైపు చెరువుల్లోను, పొలాల్లోను నీరు చేరి ఉబాలు ఊపందుకోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం అత్యధికంగా డెంకాడ మండలంల 130.6మి.మీ., పూసపాటిరేగ మండలంలో 87.2, విజయనగరంలో 79.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశమున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీలో)
వంగర	43.4
రేగిడి	9.2
సంతకవిటి	25.0
రాజాం	47.8
బొబ్బిలి	3.4
రామభద్రపురం	10.2
బాడంగి	17.4
తెర్లాం	27.0
మెరకముడిదాం	59.2
దత్తిరాజేరు	43.8
మెంటాడ	44.6
గజపతినగరం	44.6
గరివిడి	47.2
చీపురుపల్లి	35.2
గుర్ల	19.0
బొండపల్లి	42.7
గంట్యాడ	47.2
శృంగవరపుకోట	46.4
వేపాడ	26.4
లక్కవరపుకోట	19.6
కొత్తవలస	36.8
జామి	34.2
విజయనగరం	79.6
నెల్లిమర్ల	32.4
పూసపాటిరేగ	87.2
డెంకాడ	130.6
భోగాపురం	29.2

నీటి సంరక్షణలో జిల్లా టాప్

దేశంలోని అత్యుత్తమ 10 జిల్లాల్లో విజయనగరానికి చోటు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నీటి సంరక్షణ కట్టడాల నిర్మాణంలో జిల్లాకు ప్రశంసలు దక్కాయి. దేశంలోని అత్యుత్తమ పది జిల్లాల్లో విజయనగరం జిల్లాకు స్థానం దక్కింది. ఈ కట్టడాల కారణంగా జిల్లాలో భూగర్భ జల మట్టం పెరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అభినందించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణలో దేశంలోని మొదటి పది జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆరు జిల్లాలు ఉండటం అభినందనీయమని సిఎం అన్నారు. ఈ ఆరు జిల్లాల జాబితాలో ఉన్న విజయనగరం జిల్లాను కూడా ఆయన అభినందించారు. ఈ కట్టడాల నిర్మాణం వల్ల జిల్లాలో భూగర్భ జల మట్టం పెరిగి, జులై నాటికి 4.15 మీటర్లకు చేరిందని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ సాగునీటి సంఘాలు, ప్రాజెక్టు నీటి సంఘాల భాగస్వామ్యంతో భూగర్భ, ఉపరితల నీటినిల్వలను పెంచేందుకు కృషి చేయాలని కోరారు. రానున్న ఐదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జెసి ఎస్.సేతు మాధవన్, ఇతర అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జెసి, తదితరులు

మంత్రి నోట విచారణ.. ఆర్‌డిఒ నోట ఖండన

అవినీతి ఆరోపణలపై భిన్నమైన తీరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పెట్రోల్ బంకు ఎన్‌ఒసి వ్యవహారంలో వచ్చిన ఆర్‌డిఒ సిసి ఆడియో రికార్డులు, అందులో ఆర్‌డిఒ పాత్రపై విచారణ జరిపిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత చెబుతుండగా, అసలు తనపై వచ్చిన ఆరోపణలలో వాస్తవం లేదని, అసలు ఆడియో రికార్డుల సంగతే తనకు ఇప్పటి వరకు తెలియదని విజయనగరం ఆర్‌డిఒ దాట్ల కీర్తి చెప్తున్నారు. ఈనేపథ్యంలో ఇందులో ఏది నిజమో అన్నదానిపై జనం ఉత్కంఠగా చర్చించు కుంటున్నారు. ఆర్‌డిఒపై అవినీతి ఆరోపణలు అన్న శీర్షికతో ఈనెల 14న వార్త వెలువడిన సంగతి తెలిసిందే. ఈ కథనంతోపాటు అడియో రికార్డులు కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో చర్చోప చర్చలు నడుస్తున్నాయి. దీనికి స్పందించిన ఆర్‌డిఒ అసలు సిసి సంతోష్ ఆడియో రికార్డులు ఇప్పటి వరకు తన దృష్టిలో లేవని, దాని ఆధారంగా చేస్తున్న ఆరోపణలు కూడా సరికాదంటూ ప్రకటన విడుదల చేశారు.

ఇదే నిజమైతే... గురువారం డిఆర్‌సి సమావేశం అనంతరం జరిగిన మీడియా సమావేశంలో 'ఆర్‌డిఒపై వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ ఇప్పటికే సిసిఎల్‌ఎ దృష్టికి తీసుకెళ్లారని, విచారణ చేస్తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత ఎందుకు చెప్తారని జనం చర్చించుకుంటున్నారు. నిప్పులేకుండా అగ్గిపుట్టదు అన్నట్టుగా ఏదో జరిగే ఉంటుందని, ఆ విషయం తేలాలంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్‌తోపాటు సిసిఎల్‌ఎ కూడా చిత్తశుద్ధి ప్రదర్శించాల్సి వుంటుందని కూడా చర్చనడుస్తోంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను విరవణ కోరగా ఆర్‌డిఒపై వచ్చిన అడియో రికార్డుల ఆధారంగా విచారణ చేపట్టాల్సిందిగా బుధవారమే సిసిఎల్‌ఎ కమిషనర్‌కు లేఖ రాశామని ప్రజాశక్తికి తెలిపారు.

మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి

- రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలి
- డిఆర్‌సి సమావేశంలో చర్చించాలని సిఐటియు డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా
- ఇన్‌ఛార్జి మంత్రి అనితకు, కలెక్టర్‌కు వినతులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని, రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని, జిల్లా నుంచి వలసలు నివారించాలని, ఈ సమస్యలపై డిఆర్‌సి సమావేశంలో చర్చించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు గురువారం ఆందోళన చేపట్టారు. ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చేందుకు కలెక్టర్ ఇన్ గేటు నుంచి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కొద్ది సేపు వాగ్వివాదం జరిగింది. దీంతో అదే సమయంలో ఇన్ గేటు నుంచి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కలెక్టర్ ఆందోళనను చూసి ఔట్ గేటు నుంచి లోపలకు వెళ్లాల్సిన పరిస్తితి ఏర్పడింది. దీంతో డిఎస్‌పి కలెక్టర్‌తో మాట్లాడి వినతి పత్రం తీసుకునేందుకు పదిమందిని రమ్మని చెప్పడంతో కార్మికులంతా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి కూడా వినతి ఇస్తామని చెప్పారు. డిఎస్‌పి ఇందుకు అంగీకరించి సిఐటియు నాయకులును, కార్మికులను వినతి ఇచ్చేందుకు అనుమతించారు. దీంతో తొలుత కలెక్టర్ అంబేద్కర్‌కు, హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు వినతులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశ్రామికంగా వెనుకబడిన మన విజయనగరం జిల్లాలో గత కొంతకాలంగా ఒక్కొక్క పరిశ్రమ మూతపడుతోందన్నారు. నేడు జూట్ పరిశ్రమ మొత్తం దాదాపుగా లేకుండా పోయిందన్నారు. 7 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయని. గరివిడి ప్రాంతంలో మైన్స్, ఎస్ కోట ప్రాంతంలో 10 క్వారీలు మూతపడుతున్నాయని వివరించారు. ఫలితంగా సుమారు 15 వేల మంది కార్మికులు ఉపాధిపోయి రోడ్డున పడ్డారన్నారు. నడుస్తున్న పరిశ్రమల్లో కూడా 75శాతం స్థానికులకు ఉపాధి కల్పించకుండా స్థానికేతరులతో పని చేస్తున్నారన్నారు. గరివిడి ఫేకర్ 2023 నవంబర్లో లేఆఫ్ చేశారని, ఈ పరిశ్రమను మూసేయడం వలన 300 మందికి కార్మికులకు ఉపాధి పోయిందని తెలిపారు.గత కొన్నేళ్లుగా పరిశ్రమలు మూతపడటమే కానీ కొత్త పరిశ్రమ ఒక్కటీ రాలేదన్నారు. ఫలితంగా జిల్లా నుండి ఉపాధి కోసం యువతీ, యువకులు వలసలు పోతున్నారని, కావున జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని, నడుస్తున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించి జిల్లా నుంచి వలసలను అరికట్టాలని కోరారు. వారితో పాటు జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు కూడా వినతి అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకరరావు, కె.సురేష్, జిల్లా కార్యదర్శులు టివి రమణ, వి.లక్ష్మీ, బి.సుధారాణి, గౌరినాయుడు, వివిధ పరిశ్రమలు కార్మికులు పాల్గొన్నారు.



గేటు తోసుకుని లోపలికి వెళ్తున్న నాయకులు, కార్మికులు

ఆక్రమణలపై స్టాండింగ్ కమిటీ ఆగ్రహం

- పి4 లో బ్యాంకు ఉద్యోగులు, కోటీశ్వరులు లబ్ధిదారులా?
- అధికారులను ప్రశ్నించిన సభ్యులు
- 30 అంశాలతో కూడిన ఎజెండా ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'నగరంలో ఆక్రమణలు దారుణంగా పెరిగాయి, చాలా సార్లు చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు, ప్రధాన రహదారులపై ఆక్రమణలు తొలగించకుండా వార్డుల్లోకి వచి పేదలకు చెందినవి తీసేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.' అంటూ వైసిపి ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు నగర పాలక సంస్థ అధికారులపై ధ్వజమెత్తారు. గురువారం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. నగరంలో ఆక్రమణలు, పి4 గురించి సభ్యులు ప్రశ్నించడంతో కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ప్రత్యేకంగా ఒక కమిటీ వేసి ఆక్రమణలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పోలీసులు సహకరంతో ఆక్రమణలు చేసిన బల్లును సీజ్ చేస్తామని ఎసిపి హరిబాబు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, కెఎల్ పురం, కలెక్టరేట్ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించామని ఎసిపి ఐవి రమణమూర్తి తెలిపారు. బాదం బళ్ల వ్యాపారుల వద్ద ట్రేడ్ లైసెన్సు వేసి, పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఒ సాంబమూర్తి తెలిపారు. ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ గాంధీ పార్కు, ఆచంట గార్డెన్ లో కొబ్బరికాయలు ఆదాయం ఏమి అవుతుందని అధికారులను ప్రశ్నించారు. పి4 గురించి తమకెందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. పి4లో పేదలను ఎంపిక చేయకుండా బ్యాంక్‌ఉద్యోగులు, లక్షాధికారులను లబ్ధిదారులుగా ఎంపిక చేశారని అన్నారు. సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు మార్గదర్శకులా అని ప్రశ్నించారు. ఫెక్సీల విషయంలో అధికార పార్టీకి చెందిన వారికి ఒకలాగ, మిగిలిన వారికి ఒకలాగ వ్యవహరించడం సరైనది కాదన్నారు. అనంతరం ఎజెండాలో 31 అంశాలపై చర్చ జరిగింది. పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా రూ.64.60 లక్షలతో ఏడు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. గాంధీ పార్కులో రూ.28.41 లక్షలతో కళావేదిక నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సభ్యులు రేగాన రూపావతి మాట్లాడు తూ అంబేద్కర్ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు అల్లు చాణక్య, జి.వెంకటరంగరావు, సుంకరి నారాయణరావు, అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఫ్లోర్ లీడర్ రాజేష్

రైట్.. రైట్

టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు (స్త్రీశక్తి) పథకాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రారంభించనుంది. ఇందుకు సంబంధించి ఆర్‌టిసి అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గాల వారీ ఉచితబస్సు పథకాన్ని ప్రారంభించనున్నారు. విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాలకు సంబంధించి బస్సులను విజయనగరం బస్టాండ్‌లో సాయంత్రం 4గంటలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభిస్తారు. చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, ఎస్.కోట నియోజకవర్గాల్లో ఆయా ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు.

- నేటి నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం
- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా..
- జిల్లాలో 137 బస్సులు
- 5 రకాల బస్సుల్లోనే అనుమతి
- ప్రారంభించనున్న మంత్రి కొండపల్లి



ప్రజాశక్తి-విజయనగరంకోట

స్త్రీశక్తి పథకం అమలుతో జిల్లాలోని మహిళలందరికీ ఆర్‌టిసిలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కలగనుంది. జిల్లా జనాభా 23.44 లక్షలు కాగా అందులో మహిళలు 11లక్షల 74వేల మంది ఉన్నారు. వీరిలో రోజూ 25వేల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం కింద మహిళలు, బాలికలు ట్రాన్స్‌జెండర్లు రాష్ట్రంలో ఎక్కడి నుండి ఎక్కడికైనా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రోఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.

ఈ గుర్తింపుకార్డులు తప్పనిసరి

ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు మహిళలు ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐడి ప్రూఫ్‌లుగా చూపించాల్సి ఉంటుంది. ఈ పథకం అమలులో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రానున్న రోజుల్లో మహిళా కండక్టర్లకు బాడీ కెమేరాలు, బస్సులలో సీసీ కెమెరాలు అమర్చనుంది. బస్ స్టేషన్లలో మౌలిక వసతులైన ఫ్యాన్లు, మంచి నీటి సౌకర్యం కూడా కల్పించనున్నారు. ఇప్పటికే విజయనగరం ఆర్‌టిసి బస్టాండ్‌లో అదనంగా కుర్చీలు ఏర్పాటు చేశారు.

పెరగనున్న ఆక్యుపెన్సీ రేషియో

జిల్లాలోని విజయనగరం డిపో పరిధిలో 47, శృంగవరపుకోట పరిధిలో 13 రూట్లు మొత్తంగా 60 రూట్లలో 62,843 కిలోమీటర్లు ప్రయాణిస్తున్నాయి. రోజుకు జిల్లాలో ప్రస్తుతం బస్సుల ద్వారా రూ.22 లక్షలు నుంచి 25లక్షలు వరకు ఆదాయం వస్తోంది. ప్రయాణికుల రద్దీతో ఆదాయం పెరగనున్నప్పటికీ అది ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం బస్సులో 55 సీట్లు సీటింగ్ కెపాసిటీ ఉంది. సరాసరి 45 మంది ప్రయాణిస్తున్నారు. ఫ్రీబస్సు విధానంతో ఒక్కోబస్సుకు 30 మంది వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తోపులాటలు చోటు చేసుకునే అవకాశం ఉంది.

కండక్టర్లు, డ్రైవర్లపై ఒత్తిడి

ప్రయాణికులను నియంత్రించే విషయమై కండక్టర్లు, డ్రైవర్లపై విపరీతమైన ఒత్తిడి పడనుంది. ఇప్పటికే చాలా బస్సుల్లో కండక్టర్లను తీసేసి డిపోల్లో ఆన్‌కాల్ డ్యూటీపై నియామకాలు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. ఇలా చేరిన వారంతా ప్రైవేటు వారు కావడంతో బాధ్యతగా ఉంటారా? సరైన రీతిలో ప్రయాణికులతో వ్యవహరిస్తారా అన్నది ప్రశ్నార్ధకమే.

రోజుకు 25 వేల మంది

జిల్లాలో ప్రధానంగా విజయ నగరం, శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోల ద్వారా ఆర్‌టిసి సేవలందిస్తోంది. ఈ రెండు డిపోల్లో రోజుకు ప్రస్తుతం సుమారు 12,900 మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వస్తే 21,500 మంది మహిళలు ప్రయాణించే అవకాశం ఉందని ఆర్‌టిసి అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 160 బస్సులు ఉండగా, మహిళా ప్రయాణికులకు తగ్గట్టుగా ఐదు రకాల 137 బస్సులను సిద్ధం చేశారు. నాన్‌స్టాప్, సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఇంటర్‌స్టేట్, స్పెషల్ సర్వీసు బస్సుల్లో ప్రయాణ సౌకర్యం వర్తించదు. ఘాట్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణం వర్తించబోదు. ఉదాహరణకు అరకు వెళ్లాలంటే ఉచిత బస్సు వర్తించదు.

ప్రయాణికులంతా సహకరించాలి



ఉచిత బస్సు పథకం అమలుతో బస్సుల్లో ఇబ్బంది లేకుండా ప్రయాణిలంతా సిబ్బందికి సహరించాలి. జీరో టిక్కెట్ కాబట్టి కండక్టర్లపై ఒత్తిడి ఉండదు. రద్దీని బట్టి బడిబస్సులు, స్పేర్ బస్సులను కూడా వినియోగిస్తాం. నియోజకవర్గాల వారీ బస్సులను కేటాయించాం. ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ఉండేందుకు నెల రోజులు పాటు పది మంది పోలీసుల సహకారం కావాలని అధికారులను కోరాం. రానున్న రోజుల్లో బస్సుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే బస్టాండ్‌లో అదనంగా కుర్చీలు ఏర్పాటు చేశాం. ఇతర మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నాం.

-జి.వరలక్ష్మి , డిపిటిఒ

రాజారెడ్డి రాజ్యాంగం పనిచేయదు

కడపలో స్వచ్ఛందంగా ఓటు వేసే పరిస్థితి ఉందా?

హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

'ప్రజాస్వామ్యాన్ని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని నమ్ముకున్న వారి ఎవరూ నష్టపోలేదు. రాజారెడ్డి రాజ్యాంగాన్ని నమ్ముకుని జగన్ మోహన్ రెడ్డి 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. రాజారెడ్డి రాజ్యాంగం పనిచేయదని ఉప ఎన్నికల ఫలితాలతో రుజువైంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గత 30 ఏళ్లలో కడపలో ఎక్కడైనా స్వచ్ఛందంగా ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. గతంలో కనీసం నామినేషన్ కూడా వేసే పరిస్థితి లేకండా జగన్ రూల్ చేశారని విమర్శించారు. కానీ నేడు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా బయటకొచ్చి ఓటు వేశారని, ప్రజాస్వామ్యాన్ని రుచి చూశారని తెలిపారు. ఆరు వేల ఓట్లతో పులివెందుల జెడ్‌పిటిసి మెజారిటీతో కైవశం చేసుకున్నామ న్నారు. కూటమి ప్రభుత్వానికి పులివెందుల ప్రజలు స్వాగతం పలికారని, వైసిపికి కనీసం డిపాజిట్ రాలేదని తెలిపారు. పోలింగ్ బూత్‌లు మార్చామంటూ గోల చేశారని, ఈ విషయం ఎన్నికల సంఘం చేతిలో ఉంటుందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో పోలీసులను వారి సొంత పనులకు వాడుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వయసుకు కూడా గౌరవం ఇవ్వడం లేదన్నారు. తమకు ఒక సంస్కారం ఉందని, వైసిపి నాయకుల్లా తాము అలా మాట్లాడలేమని తెలిపారు. సంస్కారం లేని వారి గురించి తాము మాట్లాడలేమన్నారు. విలువలతో రాజకీయాలు చేస్తే తాము కూడా స్వాగతిస్తామన్నారు. చంద్రబాబు పాలనలో పని చేసిన ఏ ఒక్క ఉద్యోగి కూడా జైలుకు వెళ్లలేదన్నారు. జగన్ ప్రభుత్వంలో పని చేసిన ఉద్యోగులు జైలుకు వెళ్లారని వ్యాఖ్యానించారు. సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా గురువారం జెండా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వాతంత్ర్యసమర యోధుల వేషధారణలను విద్యార్థులతో వేయించి వారి గొప్పతనాన్ని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను తెలియజేయాలన్నారు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఆగస్టు 15 సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వసతి గృహాల్లో విద్యార్థులకు గురువారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె రమేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగా సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థులను ప్రోత్సహించేందుకు, బహుముఖ, సేవ, కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా క్రీడా పోటీలు నిర్వహిసున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు జి.చైతన్య, గౌరిశంకర్,పి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రధానమంత్రి జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 27 తేదీ వరకు పొడిగించినట్లు కిల్లంపాలెం నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ వి. దుర్గాప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల నిర్దేశించిన గడువులోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

భీమా కంపెనీలు వచ్చేనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత కోరారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, చోళ మండలం ఇన్సూరెన్స్ కంపెనీ, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్లతోను, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో ప్రీసిట్టింగ్ లోక్‌అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌సి,ఎస్‌టి కోర్టు జడ్జి బి.అప్పలస్వామి, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- నెల్లిమర్ల



కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పన్న

మండలంలోని కొండ గుంపాం సచివాలయం వద్ద గురువారం క్లాప్ మిత్రాలకు యూనిఫామ్స్, శానిటేషన్ కిట్లు ను సర్పంచ్ పతివాడ అప్పన్న చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యాన్ని సక్రమంగా నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లెంక తవుడు, ఉప సర్పంచ్ ఆదినారాయణ, ఇంజనీరింగ్ డిజిటల్ అసిస్టెంట్ కె.ఎల్.భవాని, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని అంబటివలస గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను మహిళా శిశుసంక్షేమ అభివృద్ధి అధికారి టి. విమలా రాణి సందర్శించారు. ఈ మేరకు గురువారం ఆమె పూర్వప్రాథమిక విద్య నిర్వహణ, విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీస్కూల్ విద్యార్థులు రాసే పుస్తకాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో ఆమె వెంట గంట్యాడ సిడిపిఓ ఉమాభారతి, సెక్టార్ సూపర్ వైజర్ సతివాడ పైడిరాజు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో నివాసాల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో గల కొత్త సింగరాయి, సోంపురం, చిన్నగుడిపాల, ఆర్ఎస్‌పేట, ముకుందపురం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు నివాసాల గుర్తింపు సర్వేలో బిజీగా ఉన్నారు. కొత్త సింగరాయిలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి, డీజే విజయ్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ్ కుమార్ పాల్గొని సర్వే చేశారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫోర్టు సిటీ పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ప్రీప్రైమరీ నుండి రెండో తరగతి చదువుతున్న విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక, మీరాబాయి వేషాధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులకు సంగీతం, నృత్యం, వక్తృత్వం, వ్యాసరచన తదితర విషయాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు(శివ), వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ కొయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమా విద్యార్థులను ప్రశంసించారు

శ్రీ భవిష్య స్కూలులో..

రాజాం : పట్టణంలో శ్రీ భవిష్య స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు స్కూల్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు విద్యార్థులు వేసిన బాలకృష్ణుడు, గోపికలు, రాధ, రుక్మిణి, సత్యభామ, యశోదవంటి వేషధారణలు అలరించాయి. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కృష్ణాష్టమి విశిష్టతను, కృష్ణుని జన్మ వృత్తాంతం, బాల్యం నుంచి కంసవధ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి : మంత్రి

ప్రజాశక్తి- గంట్యాడ/విజయనగరంకోట

పిఎసిఎస్ పరిధిలో ఉన్న రైతులకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం పెంటశ్రీరాంపురంలో జరిగిన పిఎసిఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార సంఘాల అధ్యక్షులు, మెంబర్లు మరింత ప్రతిష్టిగా పనిచేసి రైతులకు సహాయ సహకారాలను అందించాలన్నారు. రైతుకు అందుబాటులో ఉండి వారికి కావలసిన అవసరాలను తీర్చాలన్నారు. మన పూర్వీకులు సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేసి సంఘాలను అభివృద్ధి చేశారని అన్నారు. వాటిని మనం సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. రైతు అవసరాన్ని బట్టి రుణాలను అందించి ఆదుకోవాలని ప్రతి గ్రామంలోనూ రైతు భవిష్యత్తును పరిశీలన చేసి ఎదుగుదలకు కృషి చేయాలని చెప్పారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని వాటిని ప్రజల దృష్టికి తీసుకు వెళ్లడానికి కృషి చేయాలన్నారు. విజయనగరం నుండి కొండతామరపల్లి జంక్షన్ మీదుగా బురదపాడు, రేగుబిల్లి, పెంటశ్రీరాంపురానికి త్వరలో బస్సు సౌకర్యాన్ని కల్పిస్తానని హామీ ఇచ్చారు. పెంటశ్రీరాంపురంలో గ్రంథాల నిర్మాణానికి సహకరిస్తానని అన్నారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షులు కరక నారాయణ, గోపిశెట్టి శంకర్రావు, మెంబర్లు బర్ల భాస్కరరావు, గులిపల్లి అవతారం, గుడిసెట్టి దేవుడుబాబు, గండ్రియేటి సత్యంలతో ప్రమాణ స్వీకారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పీవీజి గోపాలరాజు, కోపరేటివ్ బ్యాంకు మేనేజర్, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, క్లస్టర్ నాయకుడు రంది చినరామనాయుడు, గంట్యాడ పిఎసిఎస్ అధ్యక్షుడు బూడి అప్పలనాయుడు, తాటిపూడి రిజర్వాయర్ ఆయకట్టు చైర్మన్ కళ్లెంపూడి జగన్నాథం, వెలమ సంఘం కన్వీనర్ అల్లు విజయ్ కుమార్, పెంట శ్రీరాంపురం టిడిపి నాయకులు రొంగలి కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా అప్పలనర్సింహరాజు ప్రమాణస్వీకారం

విజయనగరం మండలం జొన్నవలస పిఎసిఎస్ చైర్మన్‌గా పూసపాటి అప్పల నర్సింహరాజు, పలువురు డైరెక్టర్లు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత ఆయనకు నియామకపత్రాన్ని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ పెద్ద పీట వేస్తుంద న్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం, రైతుల కోసం కష్టపడిన వారికి అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లాలో అన్ని సంఘాలు, కమిటీల చైర్మన్, కమిటీ సభ్యులను సమిష్టిగా ఎంపిక చేస్తారన్నారు. నూతన చైర్మన్ అప్పల నరసింహరాజు మాట్లాడుతూ ఈ పిఎసిఎస్‌కు ఘన చరిత్ర ఉందన్నారు. డైరెక్టర్లుగా కె.గణేష్, ఎస్.సత్యారావు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు డైరెక్టర్ పాలవలస యశస్విని, విజయనగరం ఎఎంసి చైర్మన్ నర్సింగరావు, వైస్ చైర్మన్ బొబ్బాది చంద్రనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, జొన్నవలస ఎంపిటిసి రాజేష్ బాబు, పిఎసిఎస్ సెక్రెటరీ పి.నరేంద్ర కుమార్ , నియోజకవర్గ, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అప్పలనర్సింహరాజుకు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి



గంట్యాడ : సభలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రఘురాజు అసత్య ప్రచారం మానుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎస్ఎఫ్ఐపై ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అసత్య ప్రచారాలు మానుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వి.చినబాబు, రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ పైచేసిన ఆరోపణలను వారు ఖండించారు. రక్షాబంధన్ రోజున ఎస్ఎఫ్ఐ విద్యార్థులు పోలీసులకు రాఖీ కడితే జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరుగుతుంటే పోలీసులకు రాఖీ కట్టడం సరికాదని రఘురాజు వ్యాఖ్యానించడం సరైనది కాదన్నారు. సమస్యకు అసలు సంబంధమే లేని ఇంకో దానికి ముడి పెట్టడం భావ్యం కాదన్నారు. పోలీసులు, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు కలిసి పోయారని, అందుకే సెక్షన్ 30 తాము చేసే కార్యక్రమాలకు తప్పితే ఎస్ఎఫ్ఐ కార్యక్రమాలకు వర్తించడం లేదా అని అనడం సరైనది కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకొని తన గౌరవాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంద పడకల కేన్సర్ ఆస్పత్రికి శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపు కోట

మండలంలోని తినకండేపల్లి గ్రామంలో గల శ్రీసత్య సాయి దివ్యామృతం ఉచిత కేన్సర్ అండ్ డయాలసిస్ వంద పడకల ఆసుపత్రికి విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 నుంచి పలువురు దాతల సహకారంతో వైద్య, విద్యా సేవలు ట్రస్ట్ ద్వారా అందిస్తున్నారన్నారు. శ్రీసత్య సాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ద్వారా ఉచిత కేన్సర్ తనిఖీ సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వారి సొంత నిధులతో 100 పడకల కేన్సర్ ఆసుపత్రిని నిర్మించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గత నాలుగు ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేదవాళ్లకు, వృద్ధులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తూ, ప్రజలకు మంచి నీటి సౌకర్యం పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ వంటి సేవా కార్యకమాలు ఎన్నో చేశారని తెలిపారు. మీకు ఏ విధమైన సహాయం కావాలన్న అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, పార్లమెంట్ అధ్యక్షులు గండి బాబ్జి, ఎఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డోలీలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రహదారి సౌకర్యం కల్పించాలని

డోలీ మోతలతో నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం డోలీలతో ర్యాలీని నిర్వహించారు. దారపర్తి, మారిక, డీకేపర్తి, మూలబొడ్డవర పంచాయతీలలో గిరిశిఖర గ్రామాలకు, రోడ్డు సౌకర్యాలు కల్పించాలని, గాదెల లోవ గ్రామం నుంచి మెట్టపాలెం గ్రామం వరకు, డోలి యాత్రతో గిరిజనులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు గౌరీష్ మాట్లాడుతూ 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో అంతరిక్షానికి రాకెట్లను పంపిస్తున్నారని, గిరిజన గ్రామాలకు మాత్రం రోడ్లు వేయడం లేదని చెప్పారు. స్కూలుకు పోయి చదువుకోడానికి, అనారోగ్యం పాలైతేను, గర్భిణులను కూడా కొండలు, వాగులు, దాటుకుంటూ డోలీలతో వెళ్లాల్సిన పరిస్థితిని, మార్చాల్సిన పాలకులు, మర్చిపోతున్నందుకు నిరసనగా ఆదివాసులుగా ఈ డోలి ర్యాలీని చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి, డోలీలు లేకుండా చేయాలని ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికీ కోరుతున్నామని అన్నారు.

విజేతలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి- చీపురుపల్లి

కానిస్టేబుల్‌గా విజయం సాధించిన వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని డిఎస్‌పి ఎస్.రాఘవులు అన్నారు. స్థానిక యువతకి శిక్షణను అందించి వారిని ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన రన్ మిషన్ సక్సెస్ మీట్ కార్యక్రమంలో డిఎస్‌పి పాల్గొని మాట్లాడారు. విజయం అనేది నిరంతర శ్రమ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. శారీరక మానసిక మేళ వింపుతో తీసుకునేదే శిక్షణ అని అన్నారు. ఎంత స్థాయికి వెళ్లినా పాత రోజులను మర్చిపోకూడదని యువతకు సూచించారు. ఈ సందర్భంగా శిక్షకుడు హేమంత్ మాట్లాడుతూ కొందరి ఇన్స్పిరేషన్ ద్వారానే తాను పేద పిల్లలకు శిక్షణ ఇవ్వాలని సంకల్పం చేశానని, గత 12 ఏళ్లుగా శిక్షణను ఇస్తున్నానని, ఇంతవరకు సుమారు 150 మంది వరకు ఉద్యోగాలు సాధించారని హేమంత్ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం నవోదయ పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ భారతి(32) ఉపాధ్యాయుడు గురువారం మధ్యాహ్నం పాఠశాల ప్రాంగణంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్, సిబ్బంది హుటాహుటిన పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి పట్ల మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

తలపై రాయి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

ప్రమాదవశాత్తు తలపై రాయిపడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాకి చెందిన అమీర్‌ఖాన్ (18) అనే యువకుడు మృతి చెందాడని ఎస్ఐ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీసాయి కాటన్ బజార్ పక్కన నిర్మాణం లో ఉన్న భవనంపై నుండి భవన నిర్మాణ కార్మికుడు చూసుకోకుండా 4వ అంతస్తు నుంచి రాయిను కిందకు పడవేయడం వల్ల అదే సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్ళిన అమీర్‌ఖాన్ తలపై రాయి పడంది. తలపై దెబ్బ తగలడంతో ఆ యువకుని చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తహశీల్దార్ పనితీరుపై విద్యార్థుల నిరసన

ధ్రువపత్రాల జారీలో కొర్రీపై ఆవేదన •వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- రేగిడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగ ప్రయత్నాలకు విద్యార్థులకు కావలసిన ధృవీకరణ పత్రాలు జారీలో స్థానిక తహశీల్దార్ ఐ.కృష్ణలత నిర్లక్ష్యం వహిస్తున్నారు. ధృవీకరణ పత్రాల జారీలో కొర్రీ వేయడంతో విద్యార్థులు గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వేటలో ఉన్న విద్యార్థులు రెసిడెన్షిక డొమీషన్ ధ్రువపత్రాలకు గత వారం రోజులుగా కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షించి వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని చిన్నశిర్లాంకు చెందిన విద్యార్థులు టంకాల వాసునాయుడు, హరీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ధ్రువపత్రాలు ఆలస్యంగా ఇవ్వడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు గడువు పూర్తి కావడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన చెందారు. దీనికి తోడుగా విద్యార్థులకు క్యాస్ట్, ఇన్‌కమ్ జారీలో కూడా ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోయారు. వాస్తవంగా ధ్రువపత్రాల జారీలో కావలసిన గుర్తింపు జిరాక్సులు విఆర్ఒ, ఆర్ఐ పరిశీలించి తహశీల్దార్ టేబుల్ పై దరఖాస్తులు ఉంచినప్పటికీ రోజులు తరబడి నిర్లక్ష్యంగా సంతకం చేయకుండా వదిలేయడంతో తామంతా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు పెట్టుకోవడానికి అర్హత సాధించలేకపోతున్నామని వాపోయారు. దీనికి తోడు ఆ ధ్రువపత్రాల జారీలో ఏదో విధంగా కొర్రీలు పెట్టి తిరస్కరిస్తున్నారని మండి పడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు జారీలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు

విద్యార్థుల ధ్రువపత్రాల జారీలో తహశీల్దార్ ఇబ్బందులు పెడుతున్నారు. దరఖాస్తుదారుల వద్ద నుంచి అన్ని గుర్తింపు కార్డు జెరాక్స్‌లు తీసుకున్నా సకాలంలో ధ్రువపత్రాల జారీలో రోజుల తరబడి ఆలస్యం చేస్తున్నారు.

– వాసు నాయుడు, చిన్నశిర్లాం.

దరఖాస్తు చేసుకోలేకపోతున్నాం

ధ్రువపత్రాల జారీ ఆలస్యంతో ప్రభుత్వ ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకోలేపోతున్నాం. విద్యార్థులకు సకాలంలో ధ్రువపత్రాలు అందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

హరినాథ్, రెడ్డి పేట

డిజిటల్ సైన్ పెండింగ్ పై రైతులు ఆందోళన

అన్నదాత సుఖీభవ తమకు జమ కాలేదని సచివాలయానికి వెళితే డిజిటల్ సైన్ పెండింగ్ అని తెలుసుకొని తహశీల్దార్ కార్యాలయానికి వస్తే పట్టించుకోవడంలేదని రైతులు గురువారం కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించిన అన్నదాత సుఖీభవలో రూ.2వేలు బ్యాంక్ ఖాతాలో పడ్డాయని, రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఐదువేల రూపాయలు తమ ఖాతాలో జమ కాలేదని లచ్చన్నవలస గ్రామానికి చెందిన మీసాల భుజంగరావు ఆవేదన వ్యక్తం చేశారు. భూములున్నా రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఐదువేల రూపాయలు తమ ఖాతాలో జమ కాలేదని, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, ఎఒ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ పది రోజులుగా తిరిగినా పట్టించుకోవడంలేదని రెడ్డిపేట గ్రామానికి చెందిన రెడ్డి రాము, తవుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్నదాత సుఖీభవ అర్హతకు డిజిటల్ సైన్ పెండింగ్ లేకుండా చూడాలని, వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎఎంఒ

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని మదనాపురం ఎపి మోడల్ పాఠశాలను అకాడమీ మోనిటరింగ్ అధికారి కృష్ణవేణి గురువారం సందర్శించారు. ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు తరగతులు ఏ విధంగా జరుగుతున్నాయి అనే విషయాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరు పట్టికలను పరిశీలించి జెఇఇ, ఎన్ఈఈటి, ఎన్ఎంఎంఎస్ విద్యాశక్తి తరగతులకు బోధనలు ఏవిధంగా జరుగుతున్నాయని ప్రశ్నించారు. 2025-26 సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి భోజనాలను అందించి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తామని విద్యార్థుల పట్ల శ్రద్ధ వహిస్తామని ఉపాధ్యాయులు సహకారంతో ఏటా శతశాతం ఉత్తీర్ణత సాధిస్తామని తెలిపారు.

సంక్షేమ పథకాల ఘనత కూటమిదే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చీపురుపల్లి/రేగిడి



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎంపి కలిశెట్టి, ఎమ్మెల్యే కళా

సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం చీపురుపల్లిలో జరిగిన అన్నదాత సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 37,792 మంది రైతులకు రూ.24.32 కోట్లు అన్నదాత సుఖీభవ కింద అందజేశామన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఎమ్‌పి అప్పలనాయుడుతో కలిసి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, రాష్ట్ర నాయకులు రామలిక్ నాయుడు, త్రిమూర్తులు రాజు, నాలుగు మండలాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా..

అన్నం పెట్టే అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఇది అన్నదాత ప్రభుత్వం అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం ఉంగరాడమెట్ట వద్ద నుంచి రాజాం మార్కెట్ కమిటీ వరకూ రైతు సంబర సభలో భాగంగా ట్రాక్టర్ ర్యాలీలో స్వయంగా ట్రాక్టర్ నడిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుం దన్నారు. రైతులకు పంటలకు పెట్టుబడి దృష్ట్యా ఏడాదికి రూ.20వేలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిమిడి అశోక్ కుమార్, ధనంజయరావు, నారు జనార్ధనరావు, కే. మహేశ్వరరావు, చల్ల భుజంగరావు, గంగు కృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం అన్న క్యాంటీన్

ప్రజాశక్తి- కొత్తవలస

పేదలకు, నిరుద్యోగులకు అన్న క్యాంటీన్ వరం అని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. పట్టణ కేంద్రంలో రూ.61లక్షలతో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలల్లోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 7 నెలల పాటు తన సొంత నిధులతో పేద ప్రజల కడుపు నింపాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశామని చెప్పారు. జనసేన ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
I. P. 11 / 2025

Between
Bandi Mahesh S/o Satyanarayana, Hindu, aged 39 years, residing at D. No. 1-5-22, Bogguladibba, Cantonment, Vizianagaram town and District. ...Petitioner
And:
Keeta Srinu and 9 others .....Respondents
Respondents:-
1. Keeta Srinu S/o Appala Raju, residing at D. No. 10-08-28A, Chinna Goka Veedhi, Ugampeta, Vizianagaram.
2. Polukula Swapna W/o Surappadu, residing at Murapaka vllage, Gantyada mandal, Vizianagaram dist.
3. Potnuru Appa Rao S/o Sanyasi Rao, residing at Lankapatnam, Near Rama Mandiram, Mosakatta Veedhi, Vizianagaram.
4. Kalingula Tarunteja S/o Yelli Dasu, residing at Ugampeta, Sudda Veedhi, Vizianagaram.
5. Sama Arun Kumar S/o Prasad, residing at LB Colony, PHC Hospital Back Side, Bogguladibba, Cantonment, Vizianagaram.
6. CREDRIGHT FINANCE LTD, represented by its branch manager, Shop No. 4 & 13, Ground Floor G-Block, PSR Complex, Mayuri Tiffin's, Vizianagaram town and Dist
7. KINNARA CAPITAL FINANCE LTD, represented by branch manager, Town Centre Layout Upper 1st Floor, S. No. 5, 18B, 100 Feet Ring Road, Near Sun School, Vizianagaram town.
8. VERITAS FINANCE LTD, represented by branch manager, D. No. 16-07-22, 1ST Floor, Janaki Nilyam, Opposite Venkateswara Swamy Temple Arch, 100 Feet Ring Road, Vizianagaram town and dist.
9. HDFC Bank Ltd, represented by branch manager, PSN Estate, D. No. 8-12-15, Main Road, Santapeta, Vizianagaram.
10. SMFG Credit Finance Ltd, represented by branch manager, Building No. 7, Ground Floor, Vijay Mansion, Lower Tank Bund Road, Siddhartha Nagar, Balajinagar, Vizianagaram.

PUBLIC LEGAL NOTICE

Please take notice that the petitioner in the above I.P. filed before the above Senior Civil Judge, Vizianagaram the above matter is stands posted to **15-09-2025** for appearance of the respondents here above. You should appear in person or through an advocate at **10-30 AM** on the above said date in the above court.

If you fail to appear on the said date the Honourable Court will take appropriate decision against you.

R. RAMAKRISHNA
B. SANTOSH KUMAR
Advocates, Vizianagaram
Ph. 9490682844.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

అప్పల కృష్ణ హత్య కేసును ఛేదించిన పోలీసులు • నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని కెరటాం గ్రామంలో శనివారం రాత్రి జరిగిన నెడుగంటి అప్పలకృష్ణ హత్య కేసును బొండపల్లి పోలీసులు ఛేదించారు. అప్పలకృష్ణను మేనల్లుడు నారపాటి సాయితో పాటు భార్య రాజు, కుమారుడు హత్య చేసినట్లు గజపతినగరం సిఐ ఎ.వి రవణ తెలిపారు. గురువారం సాయంత్రం బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మృతుని మేనల్లుడు సాయి, మృతుని భార్య మధ్య వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిందని సిఐ తెలిపారు.

బిల్లలవలసలో గుర్తించి అరెస్టు

మండలంలోని బిల్లలవలస సమీపంలో అప్పలకృష్ణను హత్య చేసిన నారపాటి సాయి ఉన్నట్లు గుర్తించి బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు నారపాటి సాయిను హత్య విషయమై విచారణ చేయగా హత్యతో అప్పల కృష్ణ భార్యరాజు, కుమారుడుకు సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ మేరకు సాయితో పాటు మృతుని భార్య రాజు, కుమారుడులను అదుపులోకి తీసుకున్నాం.

ఎలా చంపేశాడంటే..

శనివారం రాత్రి సాయి తన మేనమామ అప్పలకృష్ణను కెరటాం గ్రామ చివారకు తీసుకొని వెళ్లి మద్యం సేవించారు. ఈక్రమంలో అప్పలకృష్ణ గొంతు నొక్కి సాయి హత్య చేశాడు. చనిపోయిన అప్పలకృష్ణను ఇంటికి తీసుకొచ్చేందుకు అప్పలకృష్ణ కుమారుడు, భార్య సహరించారు. సహజ మరణంగా చిత్రీకరించి వారి మత సాంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. తొలుత పోలీసులు అప్పలకృష్ణది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారణ అయ్యింది. మృతుని భార్య రాజుకు, అతని మేనల్లుడు సాయికి మధ్య ఉన్న వివాహేతర సంబంధమే హత్యకు కారణమని సిఐ స్పష్టం చేశారు. హత్య కేసును చేదించిన బొండపల్లి యస్. ఐ.యు మహేష్, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎస్ఐ మహేష్, ట్రైనీ ఎస్ఐ సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
PRAJASAKTI 45 ANNIVERSARY 1981-2025
45వ వార్షికోత్సవం
స్వాతంత్ర్య దినోత్సవ
ప్రత్యేక అనుబంధం
విజయనగరం జిల్లా
శుక్రవారం 15-8-2025
8 పేజీలు

స్వాతంత్ర్య సమరంలో విజయనగరం

తెల్లదొరల పాలన నుంచి దేశ విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో విజయనగరం జిల్లా ప్రజల పాత్ర కూడా ఉంది. 1890లోనే గంజాం, విశాఖ జిల్లాల్లో స్వాతంత్ర్యోద్యమ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ నుంచి భారత జాతీయ కాంగ్రెస్ ప్రథమ సభకు ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా మహాసభలు కూడా నిర్వహించారు. 1905లో బెంగాల్ విభజన ప్రభావం ఈ జిల్లాపై పడింది. స్వదేశీ ఉద్యమంలో ఇక్కడ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకాకుళం, పొందూరు, టెక్కలి, చీపురుపల్లి, సాలూరు, బొబ్బిలి తదితర కేంద్రాల్లో విదేశీ వస్తు బహిష్కరణ, బహిరంగ సభలు నిర్వహించి ప్రచారం చేశారు. జిల్లాలోని మేధావుల్లో ఎక్కువమంది 'న్యూ ఇండియా' ఆంగ్ల దినపత్రిక రప్పించుకునేవారు. 1920లో ప్రారంభమైన సహాయ నిరాకరణోద్యమం జిల్లాలో పెద్ద ఊపుతెచ్చింది. అనేకమంది న్యాయవాదులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. మహాత్మాగాంధీ కోస్తా జిల్లాల సందర్శన, విజయవాడలో 1921లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జిల్లాలో ఉద్యమానికి ఉత్తేజాన్నిచ్చింది. 1928లో మహాత్మాగాంధీ ఖద్దరు ఉద్యమ నిధుల కోసం విజయనగరం జిల్లాను సందర్శించారు. 1930లో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలో కూడా



అధిక సంఖ్యలో జిల్లా ప్రజలు పాల్గొన్నారు. 1933లో హరిజనోద్ధరణ కార్యక్రమంలో గాంధీ మరోమారు జిల్లాను సందర్శించి ప్రజలను చైతన్యపరిచారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమం (మిగతా..2లో)

స్వాతంత్ర్య సమరంలో విజయనగరం

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా రైల్వే, టెలిగ్రాఫ్ లైన్లు పీకివేయడం, షిప్‌ప్లేట్లు తొలగించడం తదితర కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు భాగస్వాములయ్యారు.

మహాకవి గురజాడ అప్పారావు 1910లోనే బ్రిటీష్ పాలనపై కలాన్ని కత్తిగా ఝుళి పించారు. 1888 ఫిబ్రవరి 10న విజయ నగరంలో జన్మించిన చింతకండి సత్యనారాయణ తన రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1930లో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని రాజమండ్రి, కోయంబత్తూరు, అల్లిపురం జైళ్లల్లో కఠిన కారాగారశిక్ష అనుభవించారు. గాంధీ, ఇర్విన్ ఒడంబడిక కారణంగా 1931లో జైలు నుంచి విడుదలయ్యారు. విదేశీ వస్తు బహిష్కరణ, ఖాదీ ఉద్యమాల్లో పనిచేశారు. జొన్నవలసలో జన్మించిన పూసపాటి బుచ్చి సీతారామచంద్రరాజు ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నందుకు బరంపురం, వెల్లూరు జిల్లాల్లో కఠిన కారాగారశిక్ష అనుభవించారు. 1973 ఫిబ్రవరి 7న ఆయన మృతిచెందారు. విజయనగరానికి చెందిన కడిమిశెట్టి రామ్మూర్తి 1921 నాటి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆరునెలల పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించారు. జాతీయ పాఠశాలను స్థాపించి ఖాదీ ఉద్యమం గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. పసుమర్తి వీరభద్రస్వామి విజయనగరం సహకార ఖాదీ స్టోర్స్‌కు డైరెక్టర్‌గా, విశాఖ జిల్లా గ్రామీణ పారిశ్రామికసంఘ డైరెక్టర్‌గా, ఆంధ్రరాష్ట్ర సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షునిగా పని చేశారు. అనేక ఖాదీ, స్వదేశీ ప్రదర్శనలు చేశారు. గ్రామాభ్యుదయాన్ని కోరుతూ తెలుగులో 'మాతృభూమి' అనే జాతీయవాద పత్రికకు సంపాదకత్వం వహించారు. 1932లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు పాలయ్యారు. శృంగవరపుకోట మండలం ధర్మవరానికి చెందిన అల్లు జోగినాయుడు 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ధర్మవరం గ్రామంలో ఖద్దరు నేత సంస్థను నిర్వహించారు. స్వచ్ఛంద సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని నెల్లూరు, తిరుచునాపల్లి జైళ్లలో ఏడాది కఠిన కారాగార శిక్ష అనుభవించారు. విజయనగరానికి చెందిన ఉల్లి తిరుపతి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని నాలుగు నెలలపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించారు. శేష జీవితాన్ని పాండిచ్చేరిలో యోగిగా గడిపారు. 1952 డిసెంబర్ 19న మద్రాసులో తుదిశ్వాస విడిచారు. విజయనగరానికి చెందిన ద్వారకా బమిరిరెడ్డి రామదీక్షితులు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 1930 మే 29నుంచి సంవత్సరం పాటు బరంపురం, వెల్లూరు, కన్ననూరు జైళ్లల్లో కఠిన కారాగారశిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు తిరిగి 1932 జనవరి 11నుంచి రెండేళ్లు రాజమండ్రి, వెల్లూరు జైళ్లల్లో కారాగార శిక్ష అనుభవించారు. 1952లో ఆయన మరణించారు. టేకుమళ్ల మహాలక్ష్మమ్మ, ద్వారక బమిడిపాటి మహాలక్ష్మమ్మ సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. 1905లో జన్మించిన విజ్ఞప రంగనాథం సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని రాజమండ్రి, బళ్లారి జైళ్లల్లో రెండేళ్లు శిక్ష అను భవించారు. క్విట్‌ఇండియా ఉద్యమం లో పాల్గొని తిరిగి విశాఖపట్నం, అల్లిపురం జైళ్లల్లో 1942 ఆగస్టు నుంచి నాలుగు నెలలు కారాగారశిక్ష అనుభవించారు. 1907లో జన్మించిన తాతాదేవకీ నందరావు న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారు. సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొని 13నెలల పాటు బరంపురం, బళ్లారి జైళ్లల్లో శిక్ష అనుభవించారు. జయంతి లక్ష్మీనర్సింహం తన 17వ ఏటనే 1921లో కాంగ్రెస్ వాలంటీర్‌గా పనిచేశారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో లాఠీ దెబ్బలు తిన్నారు. 1930లో ఉప్పుసత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొని రెండేళ్లు జైలుశిక్ష అనుభవించారు. అఖిల భారత చేనేత పని సంఘానికి మేనేజర్‌గా పనిచేశారు. జయంతి మహాదేవశాస్త్రి 1930లో ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొని ఆరునెలలు కఠిన కారాగారశిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని రాజమండ్రి, బళ్లారి జైళ్లల్లో రెండు సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష అనుభవించారు. 1939లో ఆయన మృతిచెందారు. ధూళిపాల పార్వతీశ్వరశాస్త్రి ఎస్‌ఎస్‌ఎల్‌సి వరకు చదువుకుని వ్యాపారస్తుడిగా స్థిరపడ్డారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని 1942 ఆగస్టు 23న అరెస్టు అయ్యారు. విశాఖ, అల్లిపురం జైళ్లల్లో కఠిన కారాగారశిక్ష అనుభవించారు. శృంగవరపుకోట తాలూకా జామిలో 1915లో జన్మించిన గుళ్లపల్లి కామేశ్వరరావు విద్యార్థి దశలోనే మధ్యప్రదేశ్‌కు చెందిన రాయపూర్‌లో సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. జిల్లా హిందుస్థాన్ సేవాదళ్‌కు కెప్టెన్‌గా పనిచేశారు. శృంగవరపుకోట తాలూకా రేగఅగ్రహారానికి చెందిన కందాళ సుబ్రహ్మణ్యతిలక్ విద్యార్థి దశ నుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించి జైలుశిక్ష అనుభవించారు. సోషలిస్టు పార్టీలో సభ్యునిగా చేరి 1951 ఫిబ్రవరిలో దానికి ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1952లో విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1977 వరకు మాన్సాస్ విద్యాసంస్థలకు ప్రధాన కార్యనిర్వహణ అధికారిగా పనిచేశారు. మద్రాసు రైల్వే సర్వీసు కమిషన్ ఛైర్మన్‌గా 1977 నుంచి 1978వరకు, సికింద్రాబాద్ రైల్వే సర్వీసు కమిషన్ ఛైర్మన్‌గా 1978 నుంచి 1981వరకు పనిచేశారు. విజయనగరం మండలం జమ్ము నారాయణపురానికి చెందిన బొత్స ఆదినారాయణ ఎస్‌ఎస్‌ఎల్‌సి వరకు చదువుకున్నారు. హోమియోపతి వైద్యం చేసేవారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని 1942 నుంచి నాలుగు నెలలపాటు విశాఖపట్టణం, అల్లిపురం జైలుల్లో శిక్ష అనుభవించారు. 1955-62 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యునిగా వ్యవహరించారు. ఆయన గతంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ మాజీ మంత్రిగా చేసిన పడాల అరుణ తండ్రి. పట్టణానికి చెందిన జెవిఎ వల్లభరావు కార్మికసంఘం నాయకుడు, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎంఎ విద్యార్థిగా ఉన్నప్పుడు యుద్ధవ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారని 1941జనవరిలో స్నాతకోత్సవం జరుగుతుండగా ఆయనను అరెస్ట్ చేశారు. 1941-42లో వెల్లూరు, రాజమండ్రి సెంట్రల్ జైలుల్లో కఠిన కారాగారశిక్ష అనుభవించారు. ఐఎన్‌టియుసిలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేశారు. 1956లో వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సభకు హాజరయ్యారు. 1954-60 మధ్యకాలంలో రాజ్యసభసభ్యునిగా ఉన్నారు. పిఇ విశ్వనాథం వ్యాపారవేత్త. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు రూ.250 జరిమానా చెల్లించారు. 1942లో ఆరుమాసాలు అల్లిపురం జైలులో శిక్ష అనుభవించారు. జైలులో నిరాహారదీక్ష చేసినందుకు మరో మూడు నెలలు అధికంగా శిక్ష విధించారు. శృంగవరపుకోట తాలూకా విసినిగిరి గ్రామానికి చెందిన బి.అప్పారావు వ్యవసాయదారు. స్వచ్ఛంద సత్యాగ్రహం చేసినందుకు 1941 నుంచి ఆరునెలలు పాటు అల్లిపురంలో జైలుశిక్ష అనుభవించారు. జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి అధ్యక్షునిగా ఉన్నారు. పట్టణానికి చెందిన అంపలాం హైమావతమ్మ 1923లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆదిరాజు జగన్నాథశర్మ క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని విశాఖ, అల్లిపురం జైలులో నాలుగు శిక్షలు కఠిన కరాగారశిక్ష అనుభవించారు. గరికివలస గ్రామానికి చెందిన బురుసు లక్ష్మణమూర్తి వ్యవసాయదారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 నుంచి రాజమండ్రి తిరుచినాపల్లి, అల్లిపురం జైళ్లల్లో రెండేళ్లు శిక్ష అనుభవించారు. గాంధీఇర్విన్ ఒడంబడికతో 1931లో విడుదలయ్యారు. పాత్రికేయుడు చొప్పల్లి నర్సింహమూర్తి యుద్ధవ్యతిరేక ప్రచారంలో పాల్గొని 15 నెలలు కఠిన కరాగారశిక్ష అనుభవించారు. పట్టణానికి చెందిన మరో పాత్రికేయుడు నిబ్బలపూడి నరసింహమూర్తి యుద్ధవ్యతిరేక ప్రచారంలో పాల్గొని 15 నెలల కఠిన కారాగారశిక్ష అనుభవించారు. ప్రముఖ రసాయనశాస్త్రవేత్త పి.నరసింహమూర్తి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని వెల్లూరు, అల్లిపురం జైళ్లల్లో ఆరునెలలు కఠిన కారాగారశిక్ష అనుభవించారు. జిల్లాలోని ద్వారపూడి గ్రామానికి చెందిన భూకామందు పివి నరసింహరాజు స్వచ్ఛంద సత్యాగ్రహంలో పాల్గొని ఏడాది కఠిన కారాగారశిక్ష అనుభవించారు. 1930లో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని బులుసు రామజోగారావు మద్రాస్, వెల్లూరు జైలులో ఆరు నెలలు శిక్ష అనుభవించారు.

ఉప్పూరి రామ్మూర్తిపంతులు సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని 1922 జనవరి నుంచి మే వరకూ జైలుశిక్ష అనుభవించారు. పట్టణానికి చెందిన డి.సాంబమూర్తి క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని విశాఖ, అల్లిపురం జైళ్లలో నాలుగు నెలలు ఉన్నారు. గజపతినగరం తాలూకా ఇంగిలాపల్లికి చెందిన కూరెళ్ల సాంబశివరావు 1930లో ఉప్పుసత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొన్నారు. మండా సత్యనారాయణ యుద్ధవ్యతిరేక ఉద్యమంలో పాల్గొనడంతో 10 నెలలు జైలుశిక్ష అనుభవించారు. స్థానిక కార్మిక ఉద్యమ నాయకుడు కె.సత్యనారాయణశాస్త్రి విద్యార్థి దశలో ఉండగా క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని నాలుగు నెలలు జైలుశిక్ష అనుభవించారు. అంపలాం సింహాచలం సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొనడంతో మరోమరు నాలుగు నెలలపాటు జైలుశిక్ష అనుభవించారు. 1907లో డివి సూర్యనారాయణ వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నందుకు రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి బహిష్కరించారు. ముట్నూరు సూర్యనారాయణ విద్యార్థి దశలోనే క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొనడంతో నాలుగు నెలలు జైలుశిక్ష అనుభవించారు.

పట్టణానికి చెందిన వ్యవసాయదారు, పట్టణ కాంగ్రెస్ కమిటీ సభ్యుడు గోక తమ్మయ్యనాయుడు క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని రూ.25 జరిమానా చెల్లించారు. పట్టణానికి చెందిన టి.వరలక్ష్మి ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని ఆరు నెలలపాటు వెల్లూరు జైలులో సాధారణ శిక్ష అనుభవించారు. భూపతిరాజు వెంకటపతిరాజు హోంరూల్ ఉద్యమంలో పాల్గొనడంవల్ల విజయనగర పురపాలకసంఘ అధ్యక్ష పదవి కోల్పోయారు. 1985 నుంచి 1947 వరకు సాగిన స్వాతంత్ర సమరంలో ఈ జిల్లా ప్రజలు తమ వంతు పాత్ర పోషించారు.

– ప్రజాశక్తి, విజయనగరం డెస్క్

గాంధీ నడయాడిన విజయనగరం

మహాత్మా గాంధీ... స్వాతంత్ర్య ఉద్యమంలో మణిమకుటం... ఆయన విజయనగరాన్ని ముచ్చటగా మూడుసార్లు సందర్శించారు. ఈ పట్టణ వీధుల్లో నడిచారు. తన వాణిని వినిపించారు. స్వరాజ్య ఉద్యమానికి పిలుపునిచ్చారు.

● తొలిసారి-మార్గం మధ్య

1921 సంవత్సరం మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీల్లో అఖిలభారత కాంగ్రెస్ సంఘ సమావేశం విజయవాడలో జరిగింది. ఆ సభల్లో పాల్గొనటానికి గాంధీ బరంపురం నుంచి బెజవాడ వెళుతూ... 1921 మార్చి 30వ తేదీ ఉదయం విజయనగరంలో దిగారు. అది విజయనగరానికి ఆయన మొదటి ఆగమనం. ప్రజలు ఘనంగా గాంధీజీకి స్వాగతం పలికారు. పెద్ద ఊరేగింపు జరిగింది. పీపుల్స్ పార్కులో పదివేలమందితో సభ జరిగింది.

● మలిసారి- ఖద్దరు యాత్ర

1929లో ఖాదీనిధి సేకరణ నిమిత్తం గాంధీజీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఆ పర్యటనలో భాగంగా విజయనగరం వచ్చారు. ఆ సంవత్సరం ఏప్రిల్ 30న ఉదయం 8.30గంటలకు దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు, ఇతర స్థానిక కాంగ్రెస్ నాయకులతో విశాఖపట్నం నుంచి మోటారు కారులో విజయనగరం వచ్చారు.

● తుదిసారి- హరిజన యాత్ర

మూడోసారి హరిజన నిధికోసం వచ్చారు. అది 1933, డిసెంబరు 29. మున్సిపల్ పార్కులో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హరిజనోద్ధరణ గురించి మాట్లాడారు. అంతకు ముందు రోజు రాత్రి డిసెంబర్ 28న విజయనగరం చేరుకొని కంటోన్మెంట్ బంగ్లాలో విశ్రాంతి తీసుకున్నారు.మరుచటి రోజు ఉదయం హరిజన వాడల్లో పర్యటించి సభాస్థలికిచేరుకున్నారు.

జాతీయ పతాక నిర్మాత పింగళి



జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఆగస్టు 2, 1878న దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మిం చారు. ఆయన బాల్యం, విద్యాభ్యాసం ఇక్కడే కొనసాగింది. 12 సంవత్సరాలకే సెకండరీ విద్య పూర్తిచేసి 19 సంవత్సరాల ప్రాయంలోనే యుద్ధంలో చేరాలనే కోరికతో ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుడు కావడంతో ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలి ఉండటంతో దేశ ప్రజలను ఆ వ్యాధి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాను జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొని ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. ఆయనకు ఆ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురు రుణం తీర్చుకున్నారట వెంకయ్య, వారి పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి. దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజి మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయ శాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేథా సంపత్తి నుంచి మనం ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు. 1906లో కోల్‌కొతాలో జరిగిన కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారతదేశ జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో మనకు అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచే వారు. ఇలా చెప్పుకుంటూ పోతే వారి జీవిత విశేషాలు ఎన్నో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి. 1921 మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీన బెజవాడలోని గాంధీ నగర్‌లో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో గాంధీజీ సమక్షంలో వెంకయ్య రూపొందించిన జెండాను ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించబడి మొదట రాట్నం ఉన్న, తర్వాత పెద్దలు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.

భారత రాజ్యాంగమే సర్వోన్నతం



దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ భిన్నమైన రూపాలలో అమలు జరుగుతున్నది. ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థ నాడు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యా యలంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడిగా అరెస్టు అయితే, నేడు న్యూస్ క్లిక్ సంపాదకుడిగా ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నారనే పేరుతో అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ నాటి కేంద్ర ప్రభుత్వ అప్రకటిత ఎమర్జన్సీ విధానాల నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత రాజకీయపార్టీలు, పౌరసంఘాలు, పౌరసమాజం, మేధావులపై ఉన్నది. రాజ్యాంగం సర్వోన్నతమైనది.



కెఎస్ లక్ష్మణరావు
శాసన మండలి మాజీ సభ్యులు

75 ఏళ్ల క్రితం అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం కాలపరీక్షకు తట్టుకుని నిలబడింది. 1945 తరువాత స్వాతంత్ర్యం పొందిన అనేక అభివృద్ధిచెందుతున్న దేశాలు, భారత దేశ ఇరుగు, పొరుగు రాజ్యాలు నియంతృత్వ రాజకీయ వ్యవస్థలను కొనసాగిస్తున్నప్పటికీ, భారతదేశం ప్రజాస్వామ్య రాజ్యంగా కొనసాగ డానికి ఒక ముఖ్యకారణం రాజ్యాంగమే. కాని ఇటీవల కాలంలో రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాల పై దాడితోపాటు రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతున్నది. ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేసిన జగదీప్ ధన్‌కడ్‌తో సహా అనేకమంది అధికారపార్టీ నాయకులు, పార్లమెంట్ సభ్యులు, సంఘ పరివార్ నాయకులు రాజ్యాంగ వ్యవస్థలపై దాడిచేయడం గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నది. అందువలన ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ అనేక సందర్భాలలో 'భారత రాజ్యాంగంమే సర్వోన్నతమైనది' అని ఉద్ఘాటించారు.

రాష్ట్రాల హక్కులు - సుప్రీంకోర్టు తీర్పు

గత దశాబ్దకాలంలో భారత సమాఖ్యలో రాష్ట్రాల హక్కులు హరిస్తూ, సమాఖ్య స్ఫూర్తిని నీరు గార్చారు. జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు, వ్యవసాయ చట్టాలు, జాతీయ విద్యా విధానం-2020, జమ్ము-కాశ్మీర్‌కు సంబంధించి 370వ ఆర్టికల్ రద్దు మొదలైన చర్యలన్నీ రాష్ట్రాల హక్కులు హరించడంలో భాగమే. తమిళనాడు ప్రభుత్వం తమ బిల్లులను గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించడంలేదని సుప్రీం కోర్టులో కేసు వేసిన నేపథ్యంలో 2025 ఏప్రియల్ 8న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్థీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎస్ రవి 2020-23 మధ్య 12 బిల్లులను ఆమోదించలేదు. రెండు రాష్ట్రపతికి పంపి, 10 బిల్లులను వెనకకు పంపాడు. రాష్ట్ర శాసనసభ ఆ 10 బిల్లులను తిరిగి ఆమోదించి పంపితే, గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు 1952 నుండి యిచ్చిన 18 రాజ్యాంగ ధర్మాసన తీర్పులను, సర్కారియా కమిషన్, పూంచాకమిషన్, రాజమన్నార కమిషన్ నివేదికలను, పరిపాలన సంస్కరణల సంఘం రిపోర్టులను అధ్యయనం చేసి తీర్పు చెప్పింది. తమిళనాడు శాసన సభ ఆమోదించి పంపిన బిల్లులన్నీ ఆమోదం పొందినట్లేనని, ఇక నుండి 3నెలల లోగా బిల్లులకు ఆమోదం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్నది. దీనికోసం సుప్రీంకోర్టు రాజ్యాంగంలో ఆర్టికల్ 142 ఉపయోగించింది.

ఈ తీర్పుపట్ల దేశవ్యాపితంగా ప్రజాస్వామ్య వాదులు హర్షం వ్యక్తంచేశారు. కాని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి మీరు ఎలా విధిస్తారు, అని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు వేశారు. రాజ్యాంగంలో 143వ నిబంధన ఉపయోగించి రాష్ట్రపతి ఈ ప్రశ్న వేశారు. సుప్రీంకోర్టు తీర్పుకేంద్ర ప్రభుత్వానికి నచ్చకపోవడం వలనే రాష్ట్రపతి చేత ఈ ప్రశ్నలు అడిగించారని కొంతమంది రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంలో మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్‌ధన్‌గడ్ 'సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రపతికి ఆదేశాలు జారీ చేసినది. జడ్జీలు సూపర్‌పార్లమెంట్‌గా వ్యవహరిస్తున్నారు.' అని విమర్శించారు. సుప్రీంకోర్టుతీర్పు స్పష్టంగా రాజ్యాంగం సర్వోన్నతం అని చెప్పినది.

రాజ్యాంగం లౌకిక రాజ్యాంగమే

రాజ్యాంగ పీఠికలో గత 'లౌకిక, సామ్యవాద' భావనలు మొదటినుండి పీఠికలో లేవని, 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారని, వాటిని తొలగించాలని అనేకమంది బిజెపి నాయకులు, బిజెపి పార్లమెంట్ సభ్యులు ప్రకటనలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ కార్యదర్శి హోసబలె ఇటీవల ఆ మేరకు ప్రకటన చేశారు. ఆ రెండు పదాలు సంఘపరివార్‌కు ఏ మాత్రం నచ్చడం లేదు. రాజ్యాంగ నిర్మాతలు స్పష్టంగా సామ్యవాద, సంక్షేమ రాజ్యస్థాపనకు రాజ్యాంగం 4వ భాగంలో ఆదేశిక సూత్రాలు చేర్చారు. రాజ్యాంగం 3వ భాగంలో ప్రాథమిక హక్కులలో ఆర్టికల్ 25 నుండి 28వరకు మత స్వేచ్ఛను కల్పించి, భారతదేశం లౌకిక రాజ్యంగా ఉండాలని భావించారు. ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి పౌరుడు తనకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చు, ఆచరించవచ్చు, ప్రచారం చేసుకోవచ్చు. 29, 30 ఆర్టికల్స్ ద్వారా భారతదేశంలో మైనార్టీలు తమ భాషను, లిపిని, సంస్కృతిని, విద్యను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాలు కల్పించాయి. అందువలనే సుప్రీంకోర్టు కేశవనందభారతి వర్సెస్ స్టేట్ఆఫ్ కేరళ కేసులో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని నిర్వచించి, మౌలిక స్వరూప లక్షణాలలో 'లౌకిక వాదాన్ని' కూడా పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో లౌకిక విధానం భారత రాజ్యాంగ ప్రాథమిక లక్షణంగా పేర్కొన్నది. ఆధునిక రాజ్యాలు మత రాజ్యాలుగా ఉంటే నియంతృత్వానికి దారి తీస్తుంది. లౌకిక రాజ్యాలుగా ఉంటేనే ప్రజాస్వామ్య రాజ్యాలుగా ఉండగలుగుతాయని వర్తమాన చరిత్ర నిరూపిస్తుంది.

అత్యవసర పరిస్థితి - నాడు

50 ఏళ్లక్రితం 1975 జూన్ 25న ఆనాటి కేంద్ర ప్రభుత్వం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో విధించిన అత్యవసర పరిస్థితి దేశంలో నియంతృత్వానికి దారి తీసింది. 352వ నిబంధన ప్రకారం విధించిన అత్యవసర పరిస్థితి ప్రాథమిక హక్కును సస్పెండ్ చేసింది. మీసా, డిఫెన్స్ఆఫ్ ఇండియా చట్టాల ద్వారా లక్షలాదిమందిని అరెస్టులు చేసి జైళ్లలో పెట్టారు. 1973నుండి క్షీణించిన ఆర్థిక పరిస్థితులు, నిరుద్యోగం, అవినీతి, 1974 దేశవ్యాప్త రైల్వే సమ్మె, జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమం, బెంగాల్‌లో అర్ధ-ఫాసిస్ట్ టెర్రర్ మొదలైన వాటితో పాటు 1975 జూన్ 12న రాయబరేలీ నియోజక వర్గం నుండి ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ప్రకటించడం అత్యవసర పరిస్థితికి దారి తీశాయి. 1975-77 మధ్య దేశవ్యాప్తంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు, ఢిల్లీవంటి ప్రదేశాలలో బ్యూటిఫికేషన్ పేరుతో వేలాది ఇళ్లను కూల్చి వేయడం వంటి దారుణాలు, అత్యాచా రాలు జరిగాయి. 1977 మార్చిలో జరిగిన ఎన్నికలలో ప్రజలు పరిపక్వత గలిగిన చైతన్యం ప్రదర్శించి అత్యవసర పరిస్థితికి కారణమైన కాంగ్రెస్‌ను, ఇందిరా గాంధీని ఓడించి జనతాపార్టీని, ఇతర పార్టీలను గెలిపిం చాయి. ప్రజలు ప్రాథమిక హక్కు లను, రాజ్యాం గాన్ని కాపాడుకుని, రాజ్యాంగమే సర్వోన్నతమైనదని నిరూపి ంచారు.

అప్రటిత ఎమర్జెన్సీ -నేడు

సమకాలీన భారతదేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతున్నదని అనేక మంది సామాజిక, రాజ్యాంగ నిపుణులు, ప్రజాస్వామ్య వాదులు భావిస్తున్నారు. నాడు 'మీసా' చట్టం అమలు చేయగా నేడు 'ఉపా' చట్టం క్రింద వేలాది మంది జైళ్లలో ఉన్నారు. ప్రొఫెసర్ సాయిబాబ, ఉమర్‌ఖలీద్ లే దీనికి ఉదాహరణ. భావప్రకటనా స్వేచ్ఛ హరించబడి ప్రాథమిక హక్కులు అణిచివేతకు గురవు తున్నాయి. గౌరి లంకేష్, కల్బుర్గి, గోవిందపన్సార్, నరేంద్రబోల్కర్ హత్యలే దీనికి తార్కాణం. నాడు పేదల గుడిసెలు కూల్చివేస్తే నేడు యుపి తో సహా అనేక రాష్ట్రాలలో బుల్డోజర్ పాలన జరుగుతున్నది. రాష్ట్రల హక్కులపై దాడి జరుగుతున్నది. లౌకిక వాదానికి భంగం కలుగుతున్నది. గోరక్షక దళాలపేరుతో మైనారిటీలు, దళితులపై నిరంతర దాడులు జరుగుతున్నాయి. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ భిన్నమైన రూపాలలో అమలు జరుగుతున్నది. ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థ నాడు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యా యలంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకుడిగా అరెస్టు అయితే, నేడు న్యూస్ క్లిక్ సంపాదకుడిగా ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నారనే పేరుతో అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఈ నాటి కేంద్ర ప్రభుత్వ అప్రకటిత ఎమర్జన్సీ విధానాల నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత రాజకీయపార్టీలు, పౌరసంఘాలు, పౌరసమాజం, మేధావులపై ఉన్నది. రాజ్యాంగం సర్వోన్నతమైనది.

ప్రజాశక్తి వెన్నుదన్ను బొమ్మారెడ్డి

అన్ని దశలలోనూ బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.' ప్రజాశక్తి' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు. ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజా శక్తి'మంతుడు' మన బొమ్మారెడ్డికే దక్కింది.

1917లో కృష్ణాజిల్లా తేలప్రోలు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. 2006 అక్టోబరు 13న కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు వున్నారు. ఆ ముగ్గురికి ఆయన కోరుకున్న పద్ధతిలోనే సంస్కరణ వివాహం జరిపించారు. తొమ్మిది పదుల నిండైన జీవితంలో అయిదు పదులు కమ్యూనిస్టు పత్రికా సంపాదకునిగా ప్రస్థానం సాగించారు. 1942లో కమ్యూనిస్టు పార్టీ పత్రిక ప్రజాశక్తి రావడంతో అందులో సబ్ ఎడిటర్‌గా చేరారు. కొన్నాళ్లకే పత్రికను ప్రభుత్వం నిషేధించినా బొమ్మారెడ్డి పత్రికా రంగాన్ని విడనాడలేదు. ఆనాటి 'ఆనంద వాణి' పత్రికకు వ్యాసాలు రాస్తుండేవారు. కమ్యూనిస్టు నాయకులందరూ అజ్ఞాత వాసంలోకి వెళ్లగా బొమ్మారెడ్డి మాత్రం గన్నవరం తాలూకా కపిలేశ్వరపురం వద్ద రహస్యంగా రాజకీయ తరగతులు నిర్వహిస్తుండే వారు. అప్పట్లో 'జనత' పత్రికను ఉపయోగించుకోవలసిందిగా గంగినేని వెంకటేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వానికి కబురంపారు.

'జనత' పత్రికను కమ్యూనిస్టు పార్టీ తీసుకుని బొమ్మారెడ్డి, మా భూమి నాటక కర్త వాసిరెడ్డి భాస్కరరావును సంపాదక వర్గంగా నిర్వహించాడు. ఆలోగా విజయవాడలో పార్టీ నాయకులపై నిర్బంధం ముమ్మరం కావడంతో పత్రికను మూసేపి బొమ్మారెడ్డిని మద్రాసు వెళ్ళమని పార్టీ ఆదేశించింది. మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ ఒక లా విద్యార్థి పేరుతో 'సందేశం' అనే వార పత్రికను నడిపింది. బొమ్మారెడ్డి ఆ పత్రికలో కొద్దికాలం పనిచేశారు. ఇంతలో తాపీ ధర్మారావు గారి 'జనవాణి'లో చేరవలసిందిగా పార్టీ ఆదేశించింది. దాంతో బొమ్మారెడ్డి తాపీ ధర్మారావు కుమారుడు మోహనరావుతో కలిసి ఆ పత్రికలో పనిచేశాడు.



మద్రాసులో బొమ్మారెడ్డి లాంటి కమ్యూనిస్టుల పరిస్థితి మరీ ఇబ్బందికరంగా వుండేది. ఆంధ్రలో పార్టీమీద ప్రభుత్వ నిఘా ఎక్కువ కావడంతో నాయకులు మద్రాసుకొచ్చి తలదాచుకునేవారు. వారికి వసతి ఏర్పాట్లు చేసే బాధ్యత బొమ్మారెడ్డి లాంటి యువకులపై వుండేది. ఎప్పుడు పోలీసులు కన్ను తమపై పడుతుందోననే వాతావరణంలో నాయకులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. ఇంతలో తెలంగాణా పోరాటం ముగిసి ఆంధ్రలోకి తిరిగి వచ్చి పని చేయడానికి అనువైన పరిస్థితులేర్పడడంతో బొమ్మారెడ్డి విజయవాడ చేరుకుని 'ప్రజాశక్తి' వారపత్రికలో పనిచేయడం ప్రారంభించారు. విశాలాంధ్ర సంపాదకవర్గంలో చేరి పన్నెండేళ్లపాటు అంటే పార్టీలో చీలిక వచ్చేవరకు అందులో పనిచేశారు. చీలిక తరువాత సిపిఐ(ఎం) తరపున 'జనశక్తి' వార పత్రిక నిర్వహించబడుతుండేది. అప్పట్లో 'జనశక్తి' ఎడిటర్‌ను అరెస్టు చేయడంతో పత్రికా నిర్వహణ బాధ్యత పార్టీ బొమ్మారెడ్డికి అప్పగించింది. నాయకులు విడుదలైన తరువాత 'జనశక్తి' దినపత్రికగా మారినా కొన్నాళ్లకు అది మార్క్సిస్టు లెనినిస్టుల చేతికిపోయింది.

ఆ తరువాత 'ప్రజాశక్తి' వారపత్రికగా మొదట కొంత కాలం నడిచి తరువాత ద్వైవార పత్రికగా, అటుపిమ్మట దినపత్రికగా మారింది. అన్ని దశలలోను బొమ్మారెడ్డి పత్రికకు వెన్నెముకగా నిలిచారు.' ప్రజాశక్తి ' దినపత్రిక తెలుగు పత్రికా రంగంలో గుర్తింపు తెచ్చుకుని నేడు ఇంతటి సమున్నత స్థితికి చేరుకుని ముప్పై ఏడవ వసంతంలోకి అడుగిడిందంటే ఇందులో బొమ్మారెడ్డి కృషి, త్యాగం మరువలేనిది. బొమ్మారెడ్డి పలు పుస్తకాలు, అనువాద రచనలు చేశారు. ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన అన్ని పత్రికల్లోనూ పనిచేసిన ఘనత ప్రజాశక్తి 'మంతుడు' మన బొమ్మారెడ్డికే దక్కింది.

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు



ప్రజాశక్తి-బాడంగి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సిఎం చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి సీనియర్ నాయకులు, గజరాయునివలస ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు అన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎరుకులపాకలు గ్రామానికి రూ.48 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మించి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశాం. కలెక్టర్, ఎంపిటిసి నిధులు రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాం. ఎమ్మెల్యే నిధులు రూ.15 లక్షలతో లక్ష్మీపురం పంచాయతీకి రోడ్డు వేశాం. మిగిలిన ఒక కిలోమీటర్ రోడ్డుకు, కల్వర్టుకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి.

బొబ్బిలి నియోజకవర్గంలో జగన్ ప్రభుత్వంలోని చేపట్టని అభివృద్ధి, కూటమి ప్రభుత్వంలో జరుగుతోంది. ఇప్పటికే సిఎం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారు. గత వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడింది. మరోవైపు అభివృద్ధి బాటలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన దూసుకుపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే అనేక అభివృద్ధి పనులు చేపట్టింది. పింఛను పెంచుతామని సిఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో గ్రామాల్లో ఇప్పటికే సిసి, బిటి రోడ్లు, కాలువల నిర్మాణాలు పూర్తి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింది.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పరిపాలన సాగుతోంది. కూటమి ప్రభుత్వం చేసింది చెప్పడమే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లక్ష్యం. యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సర్కారు బడుల్లో విద్యావ్యవస్థను మరింతగా అభివృద్ధి చేశారు. అనంతరం ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో తల్లికి వందనం డబ్బులు, అర్హులైన రైతులకు పిఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులు జమ కావడంతో టిడిపి శ్రేణుల్లో మరింత ఉత్సాహం వచ్చింది. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేయడం ఖాయం.

తెలుగు తొలి దినపత్రిక ఆంధ్రపత్రిక

తెలుగులో పూర్తిస్థాయి దినపత్రిక ఆంధ్ర పత్రికను స్థాపించి, నిర్వహించిన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు చిరకాలం స్మరించు కోదగిన మహనీయుడు. అంతకుముందు అనేకమంది కొద్దికాలంపాటు చిన్నా పెద్దా పత్రికలు నెలకొల్పి నడిపించి వుండవచ్చు. అవి అంతగా పత్రికా వ్యవస్థలో రాణించలేకపోయాయి. నాగేశ్వరరావు గారు 1908 ఆగస్టు 8వ తేదీన ఆంధ్రపత్రికను తెలుగు వారపత్రికగా స్థాపించారు. ఆయన స్వదేశీ పరిశ్రమలను స్థాపించాలన్న వాంఛతో కలకత్తా, బొంబాయి వంటి నగరాలను సందర్శించి చివరికి బొంబాయిలో అమృతాంజనం పరిశ్రమను నెలకొల్పారు. తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించాలనే లక్ష్యంతో ఆంధ్రపత్రికను స్థాపించారు. ఆంధ్రపత్రికను 1914 ఏప్రిల్ 1వ తేదీన మద్రాసుకు తరలించి, దానిని దినపత్రికగా వెలువరించారు. రాజద్రోహం నేరం కింద మూడు సంవత్సరాలపాటు కఠిన కారాగార శిక్ష అనుభవించిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావుతో మాట్లాడేందుకే కొందరు భయపడే ఆ రోజుల్లో ఆయన్ను 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు మొదటి సంపాదకుడిగా నియమించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యజమాని రామనాధ్ గోయెంకా మద్రాస్‌లో 1938లో తెలుగు దినపత్రికగా 'ఆంధ్రప్రభ'ను స్థాపించేవరకూ తెలుగువారికి ఆంధ్రపత్రిక ఏకైక దినపత్రికగా వెలుగొందింది.
ఆంధ్రపత్రిక ద్వారా తెలుగు ప్రజలను రాజకీయంగానూ, సాంఘికం గానూ చైతన్య పరిచారు. అంతేకాదు. 'భారతి' అనే సాహిత్య పత్రికను కూడా నెలకొల్పి సాహిత్య, సాంస్కృతిక, కళారంగాలను ప్రోత్సహించారు. పత్రిక ద్వారా అనేక మంది పాత్రికేయులు, రచయితలను ప్రోత్సహించారు. దినపత్రికను (మిగతా..5లో)

తెలుగు తొలి దినపత్రిక ఆంధ్రపత్రిక

(4వ పేజీ తరువాయి)

నిర్వహించడం ఆ రోజుల్లో ఎంతగానో నష్టదాయకమై నప్పటికీ నాగేశ్వరరావు వెనుకాడ కుండా ఆంధ్రపత్రికను కొనసాగించారు. తెలుగు ప్రజలకు దినపత్రికను తొలిసారిగా అందించి మహత్తర సేవచేసిన కాశీనాధుని నాగేశ్వరరావుగారు అత్యంత పూజనీయుడనీ, ఆయన ఫొటోను ప్రజాశక్తి కార్యాలయంలో వుంచడం సముచితమని సుందరయ్యగారు సలహా ఇచ్చారంటే ఆయన కృషి పట్ల ఎంతగా గౌరవాభిమానాలున్నాయో గ్రహించవచ్చు. నాగేశ్వరరావుగారు కృష్ణా, ఉభయ గోదావరుల సంయుక్త నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర శాసనసభకు పెద్ద మెజారిటీతో ఎన్నికయ్యారు. విజయవాడలోని ఆయనకు చెందిన దుర్గాభవనం కాంగ్రెస్ కార్యకలాపాలకు నిలయంగా ఉండేది.

అక్షరాయుధ యోధుడు మోటూరు హనుమంతరావు

మోటూరు హనుమంతరావు విప్లవ జీవితంలో విలక్షణ వ్యక్తిత్వాంశాలూ మదిలో మెదులుతాయి. ప్రజాశక్తి స్థాపన, పరిరక్షణ, నిర్వహణ, విస్తరణ అన్నింటితో ఆయనది అవినాభావ సంబంధం. ఆయన ప్రజాశక్తికి పర్యాయపదం. అక్షరాలను ఆయుధంగా చేసుకున్నారు. సమాజంలోని సమస్యల పొట్టచీల్చి ప్రజాకోణాన్ని ఆవిష్కరించారు. సంపాదకుడుగానూ సారథిగానూ సుదీర్ఘ కాలం పాటు ఆయన ఈ పత్రికకు ఆద్యుడూ బాధ్యుడూ కూడా.

1917లో గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా వెల్లటూరులో పేద రైతు కుటుంబంలో పుట్టిన ఎంహెచ్ పాఠశాల దశలోనే స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకున్నారు. 1930 నుంచే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభిం చారు. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్రధారి. 1943లోనే గుంటూరు జిల్లా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి అయ్యారు. రాష్ట్రంలోనూ దేశంలోనూ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఆక్రమించిన ఆ ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్రధారి అయ్యారు. కొరటాల సత్యనారాయణతో సహా ఎందరికో పార్టీ సభ్యత్వం ఇచ్చారు. కళా సాహిత్యాల పట్ల ప్రత్యేకాసక్తి గల ఎంహెచ్ ప్రజానాట్య మండలికి మార్గదర్శకుడుగా ప్రజా కళా సృజనకు దోహద పడ్డారు. శ్రీశ్రీ మొదలుకొని నిన్నమొన్నటి యువ రచయితల వరకూ ఎందరితోనో ఆయనకు అనుబంధముంది. జమున మొదలుకొని శారద వరకూ గుమ్మడి నుంచి మాదాల రంగారావు వరకూ భిన్నతరాల నటీనటులు ఆయనకు సుపరిచితులే. వాస్తవానికి ఆయనలో ఆఖరి వరకూ కనిపించని కళాకారుడుండేవాడు. దిగంబర కవిత్వం నిరసన పేరుతో సభ్యతా ప్రమాణాలను కూడా తోసిపుచ్చే కసిత్వంగా తయారై తర్వాత విరసంలోకి పయనం కట్టినప్పుడు జరిగిన చర్చలో ఆయన పాత్ర చాలా కీలకమైంది. సాహిత్యోద్యమంపై మార్క్సిస్టు అవగాహన పేరుతో ఆయన రాసిన పుస్తకం చాలా విలువైంది.

1948లో అవిభక్త కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడుగా ఎన్నికైన ఎంహెచ్ అనేక కీలకమైన తీర్మానాలూ, నివేదికలూ, పత్రాల రూపకల్పనలో ముఖ్య పాత్రవహించారు. నిర్బంధాల, నిషేధాల మధ్య రహస్యంగా పనిచేస్తూ వీర తెలంగాణా సాయుధ పోరాటానికి సహాయ మందించారు.అప్పటి ప్రజాశక్తి పత్రిక ప్రభుత్వ దాడిలో ధ్వంసమైన తర్వాత 'జనత' పత్రిక తీసుకురావడానికి తొలి సన్నాహాలు చేశారు. ఇంతలోనే 1949 మేలో అరెస్టయ్యారు. నరక కూపాలుగా రాక్షసత్వ కేంద్రాలుగా వున్న నాటి జైళ్లలో కూడా వీరోచిత పోరాటాలలో పాల్గొని అమరులైన వారి సరసనే ఆయనా వున్నారు. 1952లో విడుదలైన వెంటనే రేపల్లె నియోజక వర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు పోటీ చేసి అప్పటి రాష్ట్ర మంత్రి కల్లూరి చంద్ర మౌళిపై విజయం సాధించారు. విశాలాంధ్ర కోసం అనేక కరపత్రాలు, పుస్తకాలు రాశారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభలో ఉప నాయకులుగానూ బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో హోరాహోరీగా జరిగిన ఎన్నికల పోరాటంలోనూ, తర్వాత కూడా పార్టీ ప్రచారానికి శక్తివంతమైన ప్రచారాయుధాలందించారు. సమైక్య రాష్ట్ర సాధనకై పోరాడుతున్న నాటి సందర్భానికి తగినట్టు 'విశాలాంధ్ర' పత్రికను ప్రారంభించగా 1953 జూన్‌లో ఆయన సంపాదకుడుగా ఎన్నికయ్యారు. నాటి నుంచి అర్ధశతాబ్ది పాటు వెలువడిన పార్టీ పత్రికలన్నింటిలోనూ ఆయన ప్రత్యక్ష పాత్ర వుంది. కారాగారంలో వున్నా రహస్య జీవితంలో వున్నా శాసనసభ్యునిగా వున్నా పార్టీ కార్యదర్శిగా వున్నా విశాలాంధ్ర, జనశక్తి, ప్రజాశక్తి దిన, వార పత్రికలన్నింటికీ ఆయన జీవనాడి అయ్యారు. రాజకీయ విధా నాన్ని సూటిగా వివరించడంలోనూ, కమ్యూ నిస్టులపై దుష్ప్రచారాలను శక్తివంతంగా తిప్పి కొట్టడంలోనూ ఆయనది ఒక గొప్ప వరవడి.



యాభయ్యవ దశకంలో కమ్యూనిస్టులపై కాంగ్రెస్ అనేక నీచాతినీచమైన దాడులకు దిగినప్పుడు దాన్ని అక్షరాయుధాలతో వమ్ము చేయడంలో ఎంహెచ్ పాత్ర మరపురానిది. విశ్వవిద్యాలయాల్లో చదువుకోకపోయినా కుటుంబానికి కూడా పాండిత్య నేపథ్యం లేకపోయినా స్వయం కృషితోనే ఆయన భాషా పాటవం పెంచుకున్నారు. జనంలోంచి వచ్చిన మనిషి గనక మాటకు వుండే తూకం ఆయనకు బాగా తెలుసు. అంతకుముందు మద్దుకూరి చంద్రం కూడా సంపాదకుడుగా సులభ శైలిలో రాస్తాడని పేరున్నా ఎంహెచ్ రాజకీయ వాదోపవాదాలలో నిశితమైన వినూత్న శైలి ప్రవేశపెట్టారు. దానికి ప్రాణం వర్గ చైతన్యం కాగా దాని శక్తి రాజకీయ విధానం. మహాకవి శ్రీశ్రీ కవిత్వంలో తెలుగు భాషను పోరాట భాషగా చేస్తే ఎంహెచ్ కలం రాజకీయ వర్గ చైతన్య భరితమైన భావజాలానికి పద సంపదను సమకూర్చింది. మార్క్సిస్టు మేధావులు పండితులూ అనేక మంది వుండొచ్చు. కాని ఆ భాషను సిద్ధాంత రాజకీయ ప్రచారానికి శక్తిమంతంగా వాడుకోదగిన వారు తక్కువే. ఈ విషయంలో ఎంహెచ్, మాకినేని బసవపున్నయ్య అగ్రగణ్యులు. గ్రామీణ జీవితంలోని సహజ భాషను ప్రాచీన శతకాలు, అధునిక సాహిత్యాలలోని భాషా ప్రయోగాలనూ మేళవించారు. దానికి ఆధునికాంగ్ల పోకడలను కలగలిపారు. అన్నిటినీ మించి మార్క్సిస్టు భావజాలాన్ని మేళవించారు. ఈ ప్రయోగాలతో వారు అతి శక్తివంతమైన రాజకీయ భాషను వాడుకలోకి తెచ్చారు. 'తీరు తెన్నులు' పేరుతో ఎంహెచ్ విశాలాంధ్రలో నిర్వహించిన శీర్షిక అప్పట్లో ప్రసిద్ధం. దారీ తెన్నూ అన్న మాట అంతకుముందు ఎక్కువగా వుంటే దాన్ని తీరు తెన్నులుగా ఆయన వాడుకలోకి తెచ్చిన మాటకు మొదట భాషావేత్తలు అభ్యంతరాలు పెట్టారు గాని ఆచరణలో అదే నిలబడిపోయింది.

విశాలాంధ్ర తర్వాత జనశక్తి కాలంలోనూ ఎంహెచ్ కలం పదునైన రచనలే అందించింది. రాష్ట్రంలో సిపిఎంకు ఆయన తొలి కార్యదర్శిగా ఎన్నికై పద్దెనిమిది సంవత్సరాలు ఆ బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలోనే నగ్జలైట్ విచ్ఛిన్నాన్ని సైద్ధాంతికం గానూ నిర్మాణ పరంగానూ ఎదుర్కొని పార్టీని కంటికి రెప్పలా కాపాడేందుకు అగ్రగామిగా నిలిచారు. వాస్తవానికి 1964, 1968 రెండు సందర్భాల్లోనూ రాష్ట్రంలో సిపిఎం పునాదిని పరిరక్షించడంలోనూ, రాజకీయ వైఖరిని చాటిచెప్పడంలోనూ ఆయనదే ప్రథమ పాత్ర. ఈ పోరాట క్రమంలోనే ఆయన భాష పదునెక్కింది. వర్గ నైశిత్యం ఇనుమడించింది. కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాద అతివాదాలకు ఎడాపెడ ధోరణులని ఆయనే నామకరణం చేశారు. సూత్రబద్ధం, కంకణ ధారులుగా పనిచేయడం, నికరంగా నిలబడటం, సలాం గొట్టడం వంటి పదాలను ఆయన బాగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. పడికట్టు పదాలు, కమ్యూనిస్టు పరిభాష అని గేలి చేసే అనేకమంది దాని వెనక వుండే సిద్ధాంత బలాన్ని సహించలేకనే అలా మాట్లాడుతుంటారు. కాని మళ్లీ ఆ పదాలనే పట్టుకు వేళ్లాడుతుంటారు! పదాలమధ్య దీరాలివ్వడం ద్వారా అదనపు భావాన్ని స్ఫురింపజేయడం ఆయన విధానం. 'కష్టజీవుల కడుపు గొట్టడం ప్రజాస్వామ్యమూ, దాన్ని ప్రతిఘటించడం ఫాసిజమూనా?' అన్నప్పుడు వేరే వ్యాఖ్య లేకుండానే భావం చేరిపోతుంది. 'వీర తెలంగాణా యోధులు ఎత్తినవి తెల్ల జండాలు కాదు: ఎర్రజండాలు' వంటి శీర్షికలు రాజకీయంగా ఉర్రూతలూపేవి. 'సంక్షోభంలో సంక్రాంతి', 'యువతరానికి వెలుగుబాట సోషలిజం', 'కారు చీకటిలో కాంతిరేఖలు', 'విశాలాంధ్రలో విషాదఛాయలు' వంటి శీర్షికలన్నీ బాగా ఆకర్షించాయి.

1964, 1966లలో కూడా ఎంహెచ్ మళ్లీ జైలు జీవితం అనుభవించారు. 1975-77 మధ్య ఇందిరాగాంధీ ఎమర్జన్సీ కాలంలో కఠోరమైన రహస్య జీవితం గడిపారు. ఆయనను అరెస్టు చేసేందుకు అప్పటి జలగం వెంగళరావు ప్రభుత్వం వారంటు జారీచేసి ఇంటిగోడపై అతికించి కక్షగట్టి వ్యవహరించింది. వాటన్నిటి మధ్య అజ్ఞాత జీవితం గడుపుతూనే ఆయన అత్యవసర పరిస్థితిపై అక్షరాయుధాలు కురిపించారు. 'అంజి' అన్న చిన్నప్పటి పేరుతో ఇందిరా, సంజయ్‌ల నిరంకుశ పాలనను అపహాస్యం చేసే రచనలు చేశారు. సంజయ్ గాంధీని బాలభానుడని కాంగ్రెస్ నేతలు ఆకాశానికెత్తుతుంటే 'రాజు వెడలె' పేరుతో ఆయన వ్యంగ్య రచన చేస్తూ 'అయితే సాయింత్రం కనిపించడు కదా' అని ప్రశ్నించారు! సెన్సార్ నిబంధనలను ధిక్కరించి ప్రజాశక్తి వారపత్రిక వాటిని ప్రచురించడం అప్పట్లో పెద్ద సంచలనం. మరో వైపున ఆ కాలంలోనే సిపిఎం 'రావు' పేరుతో రాజకీయంగా ఉత్తేజం కలిగించే పలు రచనలతో పాటు రోజెన్ బర్గుల జీవిత కథను ధారావాహికంగా రాసి ప్రచురించారు. 1981 అఖిలపక్ష ఉద్యమం సందర్భంలోనూ అదేవిధంగా ఉత్తేజమిచ్చారు. అదే సంవత్సరం ప్రజాశక్తి దినపత్రిక పున: ప్రారంభమైనప్పుడు రాష్ట్రకార్యదర్శిగానూ, శాసనమండలి సభ్యుడుగానూ వుంటూనే పత్రికా బాధ్యతలు కూడా నిర్వహించాలని పార్టీ చేసిన నిర్ణయాన్ని శక్తివంచనలేకుండా అమలు జరిపారు.

ప్రజాశక్తి దినపత్రికను ప్రజలందరి పత్రికగా తీర్చిదిద్దే సందర్భంలో సమతుల్యత దెబ్బతినకుండా చూసేందుకు ఆయన ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. వాస్తవికత, వార్తా ప్రాధాన్యత, రాజకీయ దృష్టి ఏదీ దెబ్బతినకుండా సమాచారం అందించాలని తాపత్రయపడేవారు. 1984లో ఎన్‌టిఆర్‌ను నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు పొడిచిన సందర్భంలో సాగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమం నెలరోజులూ దానిపైనే సంపాదకీయాలు రాస్తూ వచ్చారు. మరో వైపున ఆ పోరాటంలో ఉపన్యాసకునిగానూ అన్ని చోట్లా పర్యటించారు. ఆయనెప్పుడూ ఈ ద్వంద్వ బాధ్యతా పోషణ చేస్తూనే వచ్చారు. మరీ ముఖ్యంగా పార్టీ కార్యకర్తలపై దాడులు, హత్యాకాండలు జరిగినప్పుడు హుటాహుటిన తరలివెళ్ళేవారు. అక్కడ దారుణాన్ని ఖండించి రావడంతో పాటు పత్రికలోనూ రాసేవారు. అందుకే ఆయన సవ్యసాచి. రాజీలేని వర్గ పటిమకు మారుపేరైన ఎంహెచ్, దివాళాకోరు ధోరణులను ఎప్పుడూ సహించేవారు కాదు. 'చచ్చిన చేప వాలున పడి కొట్టుకుపోతుంది. బతికిన చేప ఎదురీదుతుంది' అనేది ఆయన తరచూ చేసే ప్రయోగం. పార్టీపై దుష్ప్రచారం చేసేవారినుద్దేశించి 'గాజుకొంపల్లో కూచుని రాళ్లు రువ్వడం' అనేవారు(అద్దాల మేడలో అనకుండా గాజుకొంప అనడం ఆయన జీవద్భాషలో భాగం) 1986లో ఆయన రాజ్యసభకు ఎన్నికైనా పత్రిక బాధ్యతలను నిర్వహిస్తూ వచ్చారు. ఇంచుమించు అప్పుడే సోవియట్‌లో గోర్బచెవ్ నాయకత్వంలోకొచ్చాక ప్రవేశపెట్టిన దిగజారుడు విధానాలు ఆయనకు చాలా ఆగ్రహావేదనలు కలిగించాయి. వాటిని ఇక్కడ కొందరు ఆకాశానికెత్తుతుంటే ఆయన వాటి ప్రమాదకర పోకడలను గురించి హెచ్చరిస్తూ వచ్చారు. ధర్మరాజు జూదంలో ద్రౌపదితో సహా అన్నింటినీ పణంగా పెట్టినట్టు గోర్బచెవ్ సోషలిజానికే తిలోదకాలిస్తున్నాడని ముందుగా హెచ్చరించిన వారిలో ఆయన ముఖ్యులు. చివరకు 1991 ఆగస్టులో ఆ దేశమే విచ్ఛిన్నమైన తర్వాత కూడా సోషలిజం అజేయమని దృఢంగా ప్రకటించిన ధీమంతుడు ఎంహెచ్.

ప్రజాశక్తి సంపాదకుడు గానే గాక నిర్వాహక సంస్థ కన్వీనర్ గానూ ఎంహెచ్ దానికి సంబంధించిన ప్రతి చిన్న నిర్ణయం లోనూ భాగస్వామిగా వున్నారు. ఏదైనా లోతుగా పరిశీలించి అన్ని కోణాల నుంచీ ఆలోచించి అడుగు వేయడం తప్ప హడావుడి ఆయనకు తెలియదు. మధ్యలో కొంత కాలం చిక్కులెదుర్కొని పత్రిక నాలుగు పేజీలకు తగ్గినా మళ్లీ నిలదొక్కుకుని మరింత విస్తరణ దిశగా ప్రజాశక్తిని నడవడంలో పార్టీ, పత్రిక సహచరులతో పాటు ఆయన పాత్రా ప్రధానమైంది. రాజకీయ పత్రికలు నడపడం కష్టమన్న మాటను పూర్వపక్షం చేస్తూ ప్రజాశక్తి ఈ రోజు తొమ్మిది ఎడిషన్లుగా వెలువడుతున్నదంటే దీని వెనుక ఎంహెచ్ కృషి అమోఘం. పత్రికతో పాటు అందులో పనిచేసే సిబ్బందిని కన్నబిడ్డల్లా ప్రేమిస్తూ వారి కష్టసుఖాలకు ప్రతిస్పందిస్తూ ఆయన అందరికీ పెద్దదిక్కుగా నిలిచారు. మరోవైపున శ్రుతిమించిన స్వార్థంతో దిగజారిన వారిని అంతే గట్టిగా ఈసడించుకున్నారు.

ప్రజా జీవితంలో ప్రమాణాలకు ఆయన పెట్టింది పేరు. ఎన్ని బాధ్యతలు నిర్వహించినా వీసమెత్తు విమర్శలకు ఆస్కారమివ్వకుండా జీవితం గడిపారు. అందుకే ఆయన పట్ల కమ్యూనిస్టులే గాక అన్ని పార్టీల వారూ అమితమైన గౌరవం ప్రదర్శిస్తారు.

ఆంధ్రప్రదేశ్‌లోనేగాక దేశవ్యాపితంగానూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని సరైన దిశలో నడపడానికి అంకితమైన అగ్రనేతలలో ఆయన ఒకరుగా నిలిచిపోయారు. 1943లో గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా మొదలైన ఆయన జీవన ప్రస్థానం అరవయ్యేళ్ల పాటు అదే బాటలో అంకితభావంతో నడిచి 1998లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యత్వం వరకూ సాగింది. ప్రజాశక్తి వ్యవస్థాపక సంపాదకుడైన ఎంహెచ్ దాని విస్తరణను కళ్లారా చూసి సంతోషించగలిగారు. ఆయన కుటుంబం యావత్తూ ముఖ్యంగా సతీమణి ఉదయంగారు, కుమార్తెలు డాక్టర్లు టాన్యా, ఉష, అల్లుళ్ళు రంగారావు, సుధాకర్ తదితరులందరూ కమ్యూనిస్టు ఉద్యమ పథంలోనే కొనసాగారు. ప్రజాశక్తిని, ప్రజా ఉద్యమాన్ని కుటుంబంగా భావించిన ఎంహెచ్ నుంచి స్ఫూర్తి పొందిన వారంతా ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి దీక్షాబద్ధులై వున్నారు.

- తెలకపల్లి రవి

జైలుశిక్ష అనుభవించిన తొలి జర్నలిస్టు గాడిచర్ల

తాను రచించిన వ్యాసాల కారణంగా మూడు సంవత్సరాలకు పైగా కఠిన కారాగార శిక్షను అనుభవించిన జర్నలిస్టు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. రాయలసీమ ప్రాంతంలో జన్మించిన గాడిచెర్ల మద్రాసు (చెన్నై) విద్యాలయంలో ఎంఎ పట్టా పొందారు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూనే వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నారు. 'స్వరాజ్య' పత్రికలో 'విపరీత బుద్ధి' అనే శీర్షికతో "అరెరె ఫిరంగీ క్రూరవ్యాఘ్రమా, నిష్కారణంగా నీవు ముగ్గురు భారతీయులను ఒక్కసారిగా పొట్టను పెట్టుకుంటివి గదా!" అంటూ తమిళనాడులో జరిగిన పోలీసుల కాల్పులను ఖండిస్తూ ఒక వ్యాసం రాశారు. దీనితోపాటు "సాత్విక ప్రతిఘటన-నిష్ఫలత్వం' పేర అప్పట్లో బెంగాల్‌లో ప్రవేశపెట్టిన "రాజద్రోహకర సభల చట్టాన్ని" నిరసించుతూ మరో వ్యాసాన్ని రాశారు. "యుద్ధం అనివార్యం" అనే రీతిలో "మాతృ సందర్శనం- రాబోవు యుద్ధం" వ్యాసాన్ని కూడా రాశారు. మూడు వ్యాసాలూ బ్రిటీష్ పాలకులకు ఆగ్రహం కలిగించాయి. హరిసర్వోత్తమరావుపై రాజద్రోహం నేరాన్ని మోపుతూ 1908 జూన్ 18వ తేదీన అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా సెషన్స్ జడ్జి ఆరు నెలల జైలుశిక్షను విధించాడు. ఆయన చేసిన రాజద్రోహ నేరానికి కింది కోర్టు విధించిన శిక్ష ఏ మాత్రం చాలదని హైకోర్టు మూడు సంవత్సరాలకు శిక్షను పెంచింది.


జైలులో ఆయన అత్యంత బాధాకరమైన నిర్బంధ విధానాన్ని అనుభవించారు. రాజద్రోహం నేరం కింద ఇంతటి దారుణ జైలు శిక్షను అనుభవించిన హరిసర్వోత్తమరావు గారితో మాట్లాడటానికి అనేకమంది భయపడిన రోజులవి. తొలి తెలుగు దినపత్రికను ప్రారంభించిన కాశీనాథుని నాగేశ్వరరావుగారు ఆయనను 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు మొదటి సంపాదకుడుగా నియమించే సాహసానికి సిద్ధపడ్డారు. అప్పట్లో దత్త మండలాల పేర వాడుకలో వున్న ప్రాంతానికి రాయలసీమ అన్న పేరును ప్రచారం చేసింది గాడిచెర్లే. అలాగే 'ఎడిటర్' అన్న ఇంగ్లీషు పదాన్ని తెలుగులో "సంపాదకుడు" అని మొదట వాడినది కూడా ఆయనే. ఆ తరువాత కాలంలో ఆయన క్రియాశీల రాజకీయాల నుండి విరమించి గ్రంథాలయ ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేశారు. ఆంధ్ర గ్రంథాలయోద్యమ కార్యాలయానికి విజయవాడలో హరిసర్వోత్తమరావు భవనం అని నామకరణం చేశారు.



జన, కుల గణనలో కీలకాంశాలు

న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.



బి.వి. రాఘవులు
సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు

సుదీర్ఘ జాప్యం, అనిశ్చితి అనంతరం ఎట్టకేలకు 2027లో జాతీయ జనాభా లెక్కల సేకరణ కోసం భారత రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాబోయే ఈ జనగణనలో ప్రధాన మార్పు ఏమిటంటే కులగణనను చేర్చాలని నిర్ణయించడం. కులగణనను అధికార బిజెపి, దాని సైద్ధాంతిక మాతృసంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) చాలా కాలంగా వ్యతిరేకిస్తున్నాయి. సామాజిక న్యాయం కోసమే ఈ చర్య తీసుకోవడం జరిగిందని ఇప్పుడు బిజెపి ప్రతినిధి చెబుతున్నప్పటికీ ఈ నిర్ణయం వెనుక సూత్రబద్ధమైన నిబద్ధత కంటే రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని అర్థమవుతోంది.

కోవిడ్-19 మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైనప్పటికీ ఆ తర్వాత దానిని చేపట్టడంలో బిజెపి పెద్దగా ఆసక్తి చూపలేదు. బహుశా నియోజకవర్గాల పునర్విభజనను త్వరగా జరపాలని భావించి ఉండవచ్చు. రాజ్యాంగం ప్రకారం 2026 తర్వాత చేపట్టే తొలి జనగణన ఆధారంగా పునర్విభజన ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. 2026కు ముందు జనాభా లెక్కల సేకరణ జరిపితే పునర్విభజనను చేపట్టడం సాధ్యపడదు. ఇప్పుడు 2027లో జనగణన జరపాలని నిర్ణయించినందున వెంటనే పునర్విభజన కసరత్తుకు శ్రీకారం చుట్టబోతున్నారు.

కులగణన చేపట్టాలన్న డిమాండ్లను బిజెపి నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉంది. కులాల వారీగా లెక్కల సేకరణను వ్యతిరేకించాలని తాము విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్లు 2021లో లోక్‌సభకు కేంద్రం తెలియజేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది. ప్రధానమంత్రి స్వయంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023లో చేసిన ప్రసంగంలో కుల విభజనను తక్కువ చేసి మాట్లాడారు. భారతదేశంలో కేవలం నాలుగు కులాలు...మహిళలు, యువత, రైతులు, పేదలు...మాత్రమే ఉన్నాయని ఆయన ప్రకటించారు.

కులగణన విషయంలో బిజెపి దీర్ఘకాలిక వ్యతిరేకత దాని భావజాలంలోనే ఉంది. కులగణనను సంఘ్‌పరివార్ ఎప్పుడూ అనుమానంగానే చూస్తోంది. అది హిందూ సమాజంలోని తీవ్ర అసమానతలను బయటపెడుతుందని, తాము హిందుత్వ ద్వారా కోరుకున్న ఐక్యతను దెబ్బతీస్తుందని భయపడింది. అయితే వాస్తవానికి కుల గణాంకాలు అట్టడుగు వర్గాల స్వరాన్ని పెంచుతాయని, వనరులను మరింత సమానంగా పంపిణీ చేయాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తాయని, బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మత సమీకరణ వ్యూహాన్ని సవాలు చేస్తాయని సంఘ్‌పరివార్ ఆందోళన చెందుతోంది.

రాజకీయ యూటర్న్

అయినప్పటికీ బిజెపి తన వైఖరిని మార్చుకుంది. 2024 ఎన్నికలలో ఎదురైన పరాజయాలు, ఓబీసీ ఓటర్లలో పడిపోతున్న మద్దతును దృష్టిలో పెట్టుకొని 2027 జనగణనలో కులాల వారీ సమాచారాన్ని సేకరిస్తామని ప్రకటించింది. ఇది రాజకీయ ప్రేరేపిత మార్పుగా కన్పిస్తోంది. కులగణనను ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేస్తున్నాయని విమర్శిస్తున్న బిజెపి, వారి ప్రభావాన్ని తటస్థం చేసేందుకు వాటి డిమాండ్‌నే అందిపుచ్చుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ సైతం సానుకూల వైఖరి ప్రదర్శించింది. ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగించనంత వరకూ కులాల సమాచారాన్ని సంక్షేమ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చునని ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన ప్రముఖ ప్రతినిధి ఒకరు తెలిపారు.

చాలా కాలంగా కుల ఆధారిత సమాచారం అందుబాటులో లేకపోవడానికి కాంగ్రెస్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ పార్టీ కులగణనను నిర్వహించలేదు లేదా మండల్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయలేదు. 2011లో సామాజిక-ఆర్థిక కులగణన (ఎస్.ఇ.సి.సి)ను చేపట్టింది కానీ దానిని ఉద్దేశపూర్వకంగానే సార్వత్రిక గణన నుండి వేరుచేసింది. ఆ తర్వాత కచ్చితత్వం లోపించిందంటూ కులగణనను పక్కన పెట్టింది. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎస్.ఇ.సి.సి డేటాను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో ఈ ప్రక్రియ కోసం ఖర్చు చేసిన రూ.5,000 కోట్ల ప్రజాధనం వృథా అయింది.

భారతదేశంలో కులగణనకు సుదీర్ఘమైన, విభిన్నమైన చరిత్ర ఉంది. 1881 నుండి 1941 వరకూ జనాభా లెక్కల సేకరణలో కులాల సమాచారాన్ని కూడా తీసుకునే వారు. స్వాతంత్ర్యానంతరం దీనికి స్వస్తి చెప్పారు. ఇకపై జనాభా లెక్కల సేకరణలో కుల ప్రస్తావన ఉండబోదని 1950లో వల్లభ్‌భాయ్ పటేల్ ప్రకటించారు. కుల సమాచార సేకరణను తిరిగి ప్రారంభించాలని 1953లో కాకా కాలేల్కర్ నేతృత్వంలోని వెనుకబడిన తరగతుల మొదటి కమిషన్, ఆ తర్వాత 1980లో మండల్ కమిషన్ ప్రభుత్వాన్ని కోరాయి. కచ్చితమైన సంఖ్య లేనిపక్షంలో రిజర్వేషన్లు, సంక్షేమ విధానాలు లోపభూయిష్టంగా ఉంటాయిని వాదించాయి. అయినప్పటికీ ఆ తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ సిఫార్సులను పట్టించుకోలేదు. రాబోయే జనగణనలో కులాల సమాచారాన్ని సేకరించాలని 2021లో వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

జాతీయ స్థాయిలో కులాల సమాచారం లేకపోవడంతో అనేక రాష్ట్రాలు సొంతగా కుల సర్వేలు ప్రారంభించాయి. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి 1968లో కేరళలో ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సమగ్ర, శాస్త్రీయ పద్ధతిలో కుల వివరాల సేకరణ కోసం కులాలు, వర్గాలపై సామాజిక-ఆర్థిక సర్వే చేపట్టింది. రాష్ట్ర జనాభాలో ఓబీసీలు, అత్యంత వెనుకబడిన తరగతుల వారు 63 శాతానికి పైగా ఉన్నారని 2023లో బీహార్‌లో నిర్వహించిన కుల సర్వే తేల్చింది. దీంతో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 నుండి 65 శాతానికి పెంచింది. అయితే కోర్టు వివాదం కారణంగా దాని అమలు ఆగిపోయింది. అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం 2024లో కుల సర్వే నిర్వహించి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ బిల్లును ఆమోదించింది. రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చడం కోసం దానిని పంపింది. కర్ణాటక సైతం తన సామాజిక-ఆర్థిక, విద్యా సర్వే ద్వారా చర్యలు చేపట్టింది. అయితే రాజకీయ అనిశ్చితులు, డేటా చెల్లుబాటుపై ఆందోళనల నేపథ్యంలో ఆ నివేదికను ఇంకా ప్రచురించలేదు.

రాష్ట్రాలవారీగా జరిగిన కుల సర్వేలు, వివిధ వర్గాల నుంచి పెరుగుతున్న డిమాండ్లు, వాటి తక్షణ రాజకీయ ప్రయోజనాల రీత్యా కులాల వారీగా లెక్కలు సేకరించడానికి బిజెపి అంగీకరించాల్సి వచ్చింది.

> ***కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు.***

2027 జనగణన రెండు దశలుగా జరుగుతుంది. 2026 అక్టోబరులో ప్రారంభమయ్యే తొలి దశలో మంచు కురిసే ప్రాంతాలలో జనగణన చేపడతారు. 2027 మార్చి 1న రెండో దశ ప్రారంభమవుతుంది. దీనిలో దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనాభా లెక్కలను సేకరిస్తారు. జనగణనలో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది గృహాలను లెక్కించడం, గృహాల గణన. ఆ తర్వాత జనాభా లెక్కలు సేకరిస్తారు. మొదటిసారిగా జనగణనను పూర్తిగా డిజిటలీకరణ చేస్తున్నారు. మొబైల్ యాప్స్, స్వీయ గణన, రియల్-టైమ్ పర్యవేక్షణను అందులో చేరుస్తారు. జనాభా లెక్కల సేకరణ దశలో కుల సమాచారాన్ని తీసుకుంటారు. గణన పూర్తయిన పది రోజులలో ప్రాథమిక సమాచారాన్ని విడుదల చేస్తారు. అనంతరం ఆరు నెలలలో సవివరమైన విభజన డేటా విడుదలవుతుంది. ఈ కాలక్రమాన్ని పాటించినట్లయితే మొత్తం పునర్విభజన ప్రక్రియను 2029 ఎన్నికల లోగానే పూర్తి చేయవచ్చు. అయితే తన తక్షణ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ మొత్తం ప్రక్రియను బిజెపి మార్చే అవకాశం కూడా ఉంది.



రాజకీయ చిక్కుముడులు, సవాళ్లు

జనగణనలో కులాన్ని చేర్చడం వల్ల వివిధ కులాల సంఖ్య, వాటి సామాజిక ఆర్థిక స్థితిగతులకు సంబంధించి విశ్వసనీయమైన సమాచారం లభిస్తుంది. రిజర్వేషన్ల పెంపు, ఓబీసీల ఉప-వర్గీకరణ, రిజర్వేషన్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 50 శాతం పరిమితి తొలగింపు డిమాండ్లను బలపరచడానికి ఇది దోహదపడవచ్చు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన (ఇ.డబ్ల్యు.ఎస్) వారికి పది శాతం కోటా వెనుక ఉన్న హేతుబద్ధతను ధృవీకరించడానికి లేదా తిరస్కరించడానికి కూడా ఈ డేటా ఉపకరిస్తుంది. ఓబీసీల క్రీమీలేయర్ ప్రమాణాలను పరిశీలించవచ్చు. ఈ డేటా కొత్త సమాచారాన్ని వెల్లడిస్తే ఎస్సీలకు కూడా విస్తరింపజేయాలన్న డిమాండ్ ఊపందు కోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రైవేటు రంగానికి దీనిని విస్తరించాలనే అభిప్రాయం కులగణనతో బలపడుతుంది. విశ్వసనీయ కుల సమాచారం అందుబాటులో ఉన్న పక్షంలో న్యాయస్థానాలు విధానపరమైన ప్రాతిపదికన కాకుండా మెరిట్ ఆధారంగా తీర్పు చెప్పాల్సి వస్తుంది.

అయితే అనేక సవాళ్లు కూడా ఎదురవుతాయి. వివిధ ప్రాంతాలు, భాషలు, పేర్లకు సంబంధించిన సంప్రదాయాలలో వేలాది కులాలు, ఉప కులాల సమాచారాన్ని సేకరించడం ఒక గొప్ప పని. ప్రామాణికమైన వర్గీకరణ వ్యవస్థ లేకుండా సమాచారాన్ని సేకరిస్తే అది అస్థిరంగా, నిరుపయోగంగా ఉంటుంది. అధికంగా లెక్కించడం, తక్కువగా లెక్కించడం, తప్పుడు వర్గీకరణకు సంబంధించిన సవాళ్లు కూడా ఉంటాయి.

జనగణన రిజర్వేషన్లతో పాటు ఇతర ముఖ్యమైన రాజకీయ అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ప్రధానంగా ఆందోళన కలిగించే అంశం నియోజకవర్గాల పునర్విభజన. 1976 నుండి ఈ ప్రక్రియ జరగడం లేదు. అయితే 2026 జనగణన ఆధారంగా దీనిని చేపట్టబోతున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరుగుతుంది.

అదీకాక ఇక్కడ ఒక భయాందోళన కూడా వ్యక్తమవుతోంది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్.పి.ఆర్)ను తాజా పరచడం కోసం దీనిని ఉపయోగించవచ్చునని, ఆ తర్వాత దానిని వివాదాస్పద జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్.ఆర్.సి) కోసం కూడా ఉపయోగిస్తారని అనుమానిస్తున్నారు. పైగా అధికార పార్టీ విభజన ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి గణన ప్రక్రియను దుర్వినియోగం చేయవచ్చునని కూడా భయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనగణనతో పాటు ఎన్.పి.ఆర్‌ను తాజా పరచరాదన్న డిమాండ్ బలపడుతోంది.

జనగణన సమాచారాన్ని విస్తృతంగా ఉపయోగించవచ్చు. దానిని సక్రమంగా ఉపయోగించుకుంటే విధాన రూపకల్పనకు, ప్రభుత్వ వనరుల పంపిణీకి మార్గదర్శనం చేయడానికి దోహదపడుతుంది. విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు మంత్రిత్వ శాఖలకు ఈ సమాచారం తప్పనిసరి. వలసలు, ఉపాధి, సామాజిక చలనశీల ధోరణులను అర్థం చేసుకోవడానికి విధాన నిర్ణేతలకు సాయపడుతుంది.

కుల సమాచారం ఉపయుక్తమైనదే అయినప్పటికీ అది అన్నింటికీ మందు కాదు. కుల సమాచారం అందుబాటులో ఉన్నచోట కూడా ఎస్సీ, ఎస్టీలలో అసమానతలు వేళ్లూనుకుపోయి ఉన్నాయి. కేవలం కులగణన ద్వారా న్యాయం చేకూరదు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడడంలో మన నిబద్ధతను అనవసరమైన భ్రమలు బలహీనపరుస్తాయి. ముఖ్యంగా మోడీ ప్రభుత్వ హయాంలో నయా ఉదారవాద విధానాలు సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచాయి. ప్రైవేటీకరణను ప్రోత్సహించాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాయి. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన పథకాలను నీరుకార్చాయి. ఈ వ్యవస్థీకృత సమస్యలను సవాలు చేయని పక్షంలో కులగణన మాత్రమే పేదలు, అణగారిన వర్గాల జీవితాలను మార్చదు. అయినా న్యాయం కోసం జరిపే పోరాటంలో కుల సమాచారం ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగ పడుతుంది. అసమానతల నిజ స్వభావాన్ని బహిర్గతం చేయడానికి, ప్రస్తుత విధానాల వైఫల్యాన్ని బయటపెట్టడానికి, కుల ఆధారిత రాజకీయాలను ఎండగట్టడానికి ఇది సాయపడుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరిస్తే కులాలకు అతీతంగా నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడే విస్తృత ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది. నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, గృహ నిర్మాణం, భూసంస్కరణలు, ఉపాధి హామీలు, ప్రభుత్వ సేవల కల్పనలో సార్వత్రిక ప్రవేశం లభిస్తుంది.